ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 9 సెప్టెంబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 34.0
కనిష్ఠం: 25.0





లోపలి పేజీలో..

యూరియా బ్లాక్ చేస్తే పీడీ యాక్ట్

» ప్రతి రైతుకు ఎరువులు అందించాలి » అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష



• ఆలయాల సంప్రోక్షణ

రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం వీడడంతో సోమవారం తెల్లవారుజామున ఉమ్మడి పశ్చిమలోని ఆలయాలను సంప్రోక్షణ చేసి శుద్ధి చేశారు. గర్భాలయంలో స్వామివార్లకు, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. ద్వారకాతిరుల చినతిరుమలేశుని ఆలయాన్ని, పరిసరాలను, ఆలయ పాత కల్యాణ మండప ఆవరణను శుభ్రపరిచారు. భీమవరంలో సోమేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ అనంతరం స్వామికి ప్రత్యేకలంకరణ చేసి అభిషేకాలు చేశారు.

ప్రక్షాళన షురూ!

కొల్లేరు డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు



రామిలేరు డ్రెయిన్ దుస్థితి

కొల్లేరును పరీవాహక ప్రాంతాలను ఏటా ముంచెత్తుతున్న మేజర్, మైనర్ డ్రెయిన్ల ప్రక్షాళనకు అడుగులు పడుతున్నాయి. దశాబ్దాలుగా ఈ డ్రెయిన్లు పూడుకుపోయాయి. ఏటా భారీ వర్షాలతో కొల్లేరు గ్రామాలతో పాటు, పరిసర గ్రామాలు వరదపోటుకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో 21 డ్రెయిన్ల అభివృద్ధి పనులకు జలవనరుల శాఖ నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

» 21 డ్రెయిన్ల పూడికతీతకు రూ.18.81 కోట్లతో ప్రతిపాదనలు

» సాధికారిత కమిటీ ఆదేశాలతో దిద్దుబాటు చర్యలు .. నిధుల కోసం ప్రతిపాదనలు

కొల్లేరులో వరదనీరు సాఫీగా వెళ్లాలంటే డ్రెయిన్లే ప్రక్షాళన ఏకైక మార్గం. కొల్లేరుకు వరదలు వచ్చినప్పుడల్లా .రోజుల తరబడి వరదనీటిలోనే ప్రజలు సహజీవనం చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. కొల్లేరు సరస్సు పరిరక్షణ, అక్కడ ప్రజలకు సత్వరం న్యాయం చేసేందుకు కొద్దినెలలు క్రితం సుప్రీంకోర్టు నియమించిన ఐదుగురు సభ్యులతో కూడిన సాధికారిత కమిటీ కొల్లేరు ప్రజల నుంచి వినతులను స్వీకరించింది. అదే సందర్భంలో కొల్లేరు సంరక్షణకు ఏ చర్యలు తీసుకోవాలన్న కోణంలో సమీక్షలను అధికారులతో చేపట్టింది. ఈ వ్యవహారంలో ఏళ్ల తరబడి కొల్లేరు ముంపునకు కారణమవుతున్న మేజర్, మైనర్ డ్రెయిన్ల ప్రక్షాళన ఎందుకు చేపట్టలేదని జలవనరుల శాఖను తూర్పారబట్టింది. దిద్దుబాటు చర్యలకు పూనుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో జలవనరులశాఖ అధికారులు కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లోని 21 నోటిఫైడ్ డ్రెయిన్ల ప్రక్షాళనకు రూ.18.81 కోట్లతో ప్రతిపాదనలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. నిధులు మంజూరు కావాల్సి ఉంది.

ముంచుతోంది.. 67 మేజర్, మైనర్ డ్రెయిన్లే...

కొల్లేరు ముంపునకు ప్రధానంగా కారణం తమ్మిలేరు, బుడమేరు, రామిలేరుతో పాటు 67 మేజర్, మైనర్ డ్రెయిన్లతో వరద నీరు సముద్రంలోకి పోయే మార్గం లేక వరదనీరు ఎక్కడికక్కడ ఎగదన్నుతోంది. వాస్తవంగా వరదనీరు స్వీకరించడానికి మాత్రమే కొల్లేరు ఒక బేసిన్ లా ఉపయోగపడుతుంది. మేజర్, మైనర్ డ్రెయిన్లల్లోంచి వచ్చిన వరద నీరు కొల్లేరు నుంచి ఆకివీడు పరిసరాల్లోని ఉప్పుటేరు ముఖద్వారం ద్వారా సముద్రంలోకి కలుస్తోంది. ముఖద్వారం సమీప మండలాలైన కైకలూరు, మండవల్లి మండలాల్లోను ఇటీవల వంతెనల కానాల వద్ద పూడుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించారు. 2006లో కొల్లేరు ఆపరేషన్ పేరిట అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి సుప్రీం సాధికారితక కమిటీ ఆదేశాలతో అక్రమంగా వెలిసిన చెరువులను ధ్వంసం చేయించారు. కాలక్రమేణా అవి మళ్లీ చెరువులుగా రూపాంతరం చెందడంతో ఆక్రమణలు పెరిగిపోవడంతో కొల్లేరు భారీ వర్షాలతో తీవ్రంగా ముంపునకు గురవుతోంది. కొల్లేరు అభయారణ్యం 77,138 ఎకరాల్లో విస్తరించి ఉంది. కాంటూరు బయట జిరాయితీ భూములు 22వేలు ఎకరాలు, 53 సొసైటీ భూములు కింద 15,200 ఎకరాలు చేపల చెరువులు సాగవుతున్నాయి. మూడులక్షల మంది కొల్లేరులో నివసిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో ఏలూరు, భీమడోలు, పెదపాడు, దెందులూరు, ఉంగుటూరు, ఆకివీడు, నిడమర్రు మండలాలుండగా, కృష్ణాలో రెండు మండలాల్లో కైకలూరు, మండవల్లి ఉండేవి. ఇవన్నీ ఏలూరు జిల్లా కిందకు వచ్చాయి.

పూడికలు తీసే 21 నోటిఫైడ్ డ్రెయిన్లు ఇవే..

నిడమర్రు మండలం బావాయిపాలెం వద్ద ఎద్దుకోడు డ్రెయిన్‌కు రూ.11.25 లక్షలు, ఇదే మండలంలో క్రొవ్విడిలో విస్సాకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ.17.50 లక్షలు, పెద్దకోడు డ్రెయిన్‌కు రూ.11.80 లక్షలు, ఆకివీడు మండలం పెదకాపవరం ఆలకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ.20.65 లక్షలు, పెదకాపవరంలో తుమ్మకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ.4.85 లక్షలు, అప్పారావుపేటలోని గుమ్మలూరుకోడు డ్రెయిన్‌కు రూ.19.95లక్షలు, సిద్ధాపురంలో సిద్ధాపురం మైనర్ డ్రెయిన్‌కు రూ.5.70లక్షలు, ఆకివీడులోనే చినకాపవరం మీడియం డ్రెయిన్‌కు రూ.కోటి ఐదు లక్షల05వేలు, పెదపాడు మండలం ముప్పర్రు ప్రాంతంలో మొండికోడు నుంచి పాతముప్పర్రు మైనర్ డ్రెయిన్‌కు రూ.6.10లక్షలు, అప్పనవీడు మైనర్ డ్రెయిన్‌కు రూ.36.90లక్షలు, చంద్రయ్యకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ.10.05లక్షలు, రాచకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ.41.50లక్షలు, వట్లూరు మేజర్ డ్రెయిన్‌కు రూ.3కోట్ల09 లక్షలు, రామిలేరు మేజర్ డ్రెయిన్‌కు రూ.6 కోట్ల37లక్షల24వేలు, పెదపాడులోని పెదపాడు మేజర్ డ్రెయిన్‌కు రూ.2కోట్ల 67లక్షల 83వేలు, లోయేరు మీడియం డ్రెయిన్‌కు రూ.కోటి 23లక్షల72వేలు, ఏలూరు మండలంలోని శ్రీపర్రు నుంచి (మిగతా 8వ పేజీలో)



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వారికి విద్యను దూరం చేయొద్దు : కలెక్టర్

ఏలూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):సంచార జాతుల వారి పిల్లలను విద్యకు దూరం చేయవద్దని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారి తల్లిదండ్రులకు హితవు పలికారు. ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ముక్కంటి, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి ప్రజల నుంచి 324 అర్జీలు స్వీకరించారు. సంచార జాతుల కుటుంబాల పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాలని వారిని దత్తత తీసుకున్న వంగాయగూడెం మునిసిపల్ ఎలిమెంట్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్ధనపు శ్రీనివాసరావు కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ ఆధార్ కార్డులు చేసేలా అధికారులకు ఆదేశాలిచ్చారు.

మోసపూరిత లావాదేవీలపై జాగ్రత్త : ఎస్పీ



ఏలూరు క్రైం : మోసపూరిత లావాదేవీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ జిల్లా ప్రజలకు సూచించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఏఎస్పీ సూర్య చంద్రరావుతో కలసి ప్రజల నుంచి 38 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



క్యూలో పడిగాపులు కాచి..



ఆధార్ నమోదు చేయించి..



ఎరువుతో ఇంటికి..

యూరియా.. వచ్చిందోచ్!

ఏలూరు డీసీఎంఎస్ గొడౌన్‌కు సరఫరా అయిన 18 టన్నుల యూరియాను తీసుకోవడానికి సోమవారం రైతులు బారులు దీరారు. గంటల తరబడి వేచి ఉండి మరీ యూరియాను తీసుకున్నారు. చుట్టుపక్కల సమీప గ్రామాలైన పోతునూరు, శనివారపుపేట, జాలిపూడి, కాట్లంపూడి, పాలగూడెంలకు చెందిన రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. రైతులంతా క్యూ పాటించగా ఆధార్ కార్డును ఈ పోస్ మిషన్‌లో అనుసంధానం చేసి డీసీఎంఎస్ సిబ్బంది ఎరువుల సరఫరాను సక్రమంగా కొనసాగించారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఇద్దరికి అర్హత..మరో ఐదుగురి అనర్హత

లోపలి పేజీలో..



ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న మంత్రి కొలుసు

త్వరలోనే ఖాళీ పోస్టుల భర్తీ

» మంత్రి పార్థసారథి .. మెడికల్ కళాశాల నిర్మాణ భవనాల పరిశీలన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో త్వరలోనే వైద్య సిబ్బంది నియామకాలు భర్తీ చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా లేదా సీఎస్ఆర్ ద్వారా అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు చేపడతామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాలను సోమవారం మంత్రి పరిశీలించారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో అవసరమైన భవనాలు, వైద్య చికిత్స పరికరాల వివరాలను వైద్య శాఖ అధికారుల నుంచి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆసుపత్రిలో కొన్ని భవనాలను వైద్య కళాశాలకు వినియోగిస్తున్నారని, రెండు, మూడు నెలల్లో వైద్య కళాశాల భవనాలు పూర్తయితే అవి కూడా యథావిధిగా తిరిగి ఆస్పత్రి వినియోగంలోకి వస్తాయన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి ఉన్నారు.



సీఎన్నార్ గార్డెన్ వద్ద రహదారి పైకి వస్తున్న దళిత సంఘాల యువకులను అడ్డుకుంటున్న పోలీసులు



దానగూడెం గ్రామంలో పెద్దఎత్తున ర్యాలీగా వస్తున్న వివిధ గ్రామాల దళిత యువకులు

మరోసారి ఉద్రిక్తత

» కైకలూరులో ఆందోళనకు దళితుల యత్నం

» దాడి ఘటనలో మరికొందరిపై కేసుల నమోదుకు డిమాండ్

» అడ్డుకున్న పోలీసులు.. 144 సెక్షన్ అమలు

కైకలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):కైకలూరు కరకట్ట ప్రాంతంలో సోమవారం మరోసారి ఉద్రిక్తత నెలకొంది. వినాయక నిమజ్జనం సమయంలో దాడులకు పాల్పడిన జనసేన పార్టీకి చెందిన యువకులను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే మరి కొంతమందిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ దానగూడెం, ఇతర గ్రామాల దళితులు సోమవారం ఆందోళనకు దిగేందుకు ప్రయత్నం చేశారు. ముందుగానే అప్రమత్తంగా వున్న పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేయగలిగారు. ఈ క్రమంలో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది.

వివిధ ప్రాంతాల నుంచి దళిత సంఘాల నేతలు, గ్రామస్థాయి నాయకులు కైకలూరు వస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆదివారం అర్ధరాత్రి నుంచే నిఘా పెంచారు. పలువురి దళిత నాయకులను అరెస్టు చేశారు. అయినా ఏలూరు, చాటపర్రు, మాదేపల్లి, భీమవరం, విజయవాడ, కైకలూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి దళిత యువకులు దానగూడెం చేరుకున్నారు. జాతీయ రహదారి పైకి సుమారు 700 మందికి పైగా వచ్చి ఆందోళన చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మధ్యాహ్నం చేపల చెరువు గట్ల వెంబడి ఏలూరు రోడ్డులోని సీఎన్నార్ గార్డెన్ కల్యాణ మండపం వద్ద రహదారి పైకి చొచ్చుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే అక్కడ పోలీసు పికెట్ ఉండడంతో వారిని రహదారిపైకి రాకుండా అడ్డుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు 307 సెక్షన్‌తో కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని, బయట గ్రామాల యువకులు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించడంతో వెనక్కు తగ్గిన యువకులు దానగూడెంకు (మిగతా 8వ పేజీలో)



పోలీసు పికెట్లు.. 144 సెక్షన్ అమలు

నిరసనకారులను కట్టడి చేసేందుకు, అల్లర్లకు తావు లేకుండా పోలీసులు కైకలూరు చుట్టూ పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. బైపాస్ రోడ్డులో వినాయకుడి గుడి, కరకట్ట ఆంజనేయస్వామి గుడి, దానగూడెం వెళ్లే శాంప్ డ్రెయిన్ వంతెన, కాకతీయనగర్ మురుగుకాల్వ వంతెన, సీఎన్నార్ గార్డెన్‌ల వద్ద పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు. దానగూడెం వెళ్లే వారిని పూర్తిస్థాయిలో తనిఖీ చేసి పంపించారు. కైకలూరులో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రజలు గుమిగూడి ఉండవద్దని మైక్ ద్వారా ప్రచారం చేశారు. దానగూడెం, కరకట్ట ప్రజలు గుర్తింపు కార్డులను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు ఉప్పులేటి పరామర్శ



దానగూడెంలో ఇటీవల అల్లర్లలో గాయ పడిన వారి కుటుంబ సభ్యులను రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఇన్‌చార్జి ఉప్పులేటి దేవీ ప్రసాద్ పరామర్శించారు. దాడి ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దళితులపై దాడులు అమానుషమని, కొల్లి బాబి అనే వ్యక్తిని అరెస్టు చేయాలని లేకుంటే పెద్దఎత్తున నిరసన చేస్తామన్నారు.





జీలుగుమిల్లిలో శిథిల భవనంపై మొలిచిన చెట్లు.. పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న ప్రాంగణం... శిథిల భవనంలో 'భద్రపరిచిన' పాత టైర్లు




కాళ్ల పీహెచ్‌సీలో శిథిల భవనంలో సిబ్బంది విధులు.. శ్లాబ్ పడిపోకుండా సపోర్ట్‌గా పెట్టిన కర్రలు

ఆస్పత్రికి నిర్లక్ష్యం జబ్బు

జీలుగుమిల్లి పీహెచ్‌సీలో శిథిల భవనాలతో తిప్పలు.. కాళ్ల పీహెచ్‌సీలో అసంపూర్తి నిర్మాణాలు..



జీలుగుమిల్లి పీహెచ్‌సీ ఆవరణలో శిథిల భవనాలు



కాళ్లలో పునాది స్థాయిలో నిలిచిన పీహెచ్‌సీ భవనం

సామాన్య ప్రజలకు వైద్య సేవలందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్లక్ష్యం జబ్బుతో కునారిల్లుతున్నాయి. జీలుగుమిల్లి పీహెచ్‌సీ భవనాలు శిథిలం కావడంతో 15 ఏళ్ల క్రితం నూతన భవనాలు నిర్మించారు. అవి సరిపడక రెండేళ్ల క్రితం రూ.40 లక్షలతో అదనపు నిర్మాణం పూర్తయినా నేటికి ప్రారంభించలేదు. శిథిల భవనాలు గాలికి వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. పాములు, విష పురుగులకు ఆవాసంగా మారాయి. పాత టైర్లు, సామగ్రి పడేయడంతో అనారోగ్య పరిస్థితులు దాపురించాయి.

కాళ్ల పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించి గాలి కొదిలేశారు. పునాదులు కూడా కనబడకుండా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ పనులు గాలికొదిలేశాడు..!

జీలుగుమిల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తోంది. పీహెచ్‌సీ ఆవరణలో పలు శిథిల భవనాలపైనా పక్కన పెరిగిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలయ్యాయి. శిథిల భవనాలపై సుమారు 25 అడుగుల ఎత్తులో చెట్లు పెరిగాయి. దాదాపు 20 ఏళ్లగా పీహెచ్‌సీ భవనాలు శిథిలం కావడంతో 15 ఏళ్ల క్రితం కొత్త భవ నాలు నిర్మించారు. తర్వాత అవి సరిపోకపోవడంతో రూ. 40 లక్షలతో చేపట్టిన అదనపు భవనాలు నిర్మాణాలు రెండేళ్ల క్రితం పూర్తయ్యాయి. నూతన భవనాలు నేటికీ ప్రారంభించలేదు. శిథిల భవనాలతో ఇబ్బందులు తలెత్తాయి. అపారిశుధ్యంతో పీహెచ్‌సీ ఆవరణ దోమలకు నిలయంగా మారింది. సుమారు 14 ఏళ్లగా ట్రీహౌస్‌లా కనిపిస్తోంది. పాడైన భవనాల్లో పాత టైర్లను భద్రంగా ఉంచడంతో దోమలకు ఆవాసంగా మారాయి. చెట్లను అలాగే వదిలేస్తే వాటి వేర్లు పక్కనే ఉన్న పీహెచ్‌సీ నూతన భవనాలకు ఎగబాకి అవికూడా పాడయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. చిట్టడవిని తలపిస్తున్న పీహెచ్‌సీ ఆవరణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, శిథిల భవనాలు తొలగించేందుకు చర్యలు చేపట్టి ఆస్పత్రి ఆవరణలో దోమల బెడద లేకుండా చూడాలని గిరిజన సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. రాచన్నగూడెం పీహెచ్‌సీ ఆవరణలో కూడా పిచ్చి మొక్కలతో పాములు సంచరిస్తున్నాయి.

ఐదేళ్లుగా పునాది దశలోనే పీహెచ్‌సీ భవనం

కాళ్ల: మండల కేంద్రమైన కాళ్లలో దశాబ్దాల చరిత్ర కలిగిన పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరింది. భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో 2020లో శ్రీకారం చుట్టారు. నాటి వైసీపీ ప్రభుత్వం దీనికి రూ. 1.80 కోట్లు మంజూరు చేసింది. పునాది దశలో పనులకే బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఐదేళ్లగా పునాది దశలోనే ఉండడంతో పిచ్చిమొక్కలతో చిట్టడవిగా మారింది. ప్రస్తుత భవనం పూర్తిగా శిథిలమైంది. శ్లాబ్ ఆకస్మాత్తుగా కూలిపోకుండా సపోర్టుగా కర్రలు అమర్చారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరగడంతో కనీసం కూర్చొనే వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు. రోగులతోపాటు సిబ్బందికి ఇటీవల దాతల సహకారం, ఆసుపత్రి అభివృద్ధి నిధులతో శ్లాబు మరమ్మతులు చేయించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ ఏఈ కె.శ్రీహరిరాజును వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వం హయాంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల పనులు నిలిపివేశారని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకువెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు.



పెనుగొండలో రోడ్డు పక్కన మొక్కజొన్న పొత్తుల బండి

మొక్కజొన్న ఆరోగ్యం ఉపాధి

పెనుగొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):గోదావరి లంక ప్రాంతాల్లో విస్తారంగా పండే మొక్కజొన్న పొత్తులు గ్రామాల్లో కొందరికి మంచి ఉపాధి. తిన్న వారికి కాలక్షేపంతో పాటు మంచి ఆరోగ్యం. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతీ ఒక్కరు ఇష్టపడతారు. మొక్కజొన్న పొత్తులు మంచి ఆరోగ్యమని వైద్యులు చెబుతారు. సహజసిద్ధంగా పండిన మొక్కజొన్న కండెలను నిప్పులపై కాల్చి నేరుగా తినడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

- ఒక కప్పు మొక్కజొన్న గింజలు 125 క్యాలరీల శక్తినిస్తాయి.
- 25 గ్రాములు కార్బోహైడ్రేడ్‌లు, 4 గ్రాములు ప్రొటీన్లు,
- 9 గ్రాముల షుగర్, 75 మిల్లీ గ్రాముల ఐరెన్ ఉంటుంది.
- విటమిన్‌బి 12 పుష్కలం, కాగా పోలిక్ యాసిడ్, ఐరెన్ అధికం.

ఇవన్నీ శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో తోడ్పడతాయని వైద్యులు చెబుతారు. మొక్కజొన్న కండెలు నిప్పులపై కాల్చి లేదా ఉడకబెట్టుకుని తింటూ ఉంటారు. రకాలను బట్టి పేలాలు, పాప్‌కార్న్, కార్న్‌ఫ్లేక్స్ తయారు చేస్తారు. మొక్కజొన్న పిండితో వివిధ రకాల పిండి వంటలు కూడా తయారు చేస్తారు. పశువులు, కోళ్ల దాణాగా కూడా ఉపయోగిస్తారు. బేకింగ్ సోడా తయారీలో మొక్కజొన్న వాడతారని చెబుతారు.

ధర అధికమే..

ఒక్క మొక్కజొన్న కండె రూ.20 నుంచి రూ.30 ధర పలుకుతోంది. వినియోగం గణనీయంగా పెరగడంతో అదేస్థాయిలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. గత రెండు మూడేళ్లలో రూ. 5 నుంచి రూ. పదికి పెరగ్గా తర్వాత రూ.15 నుంచి రూ.20 ధర ఉంది. డిమాండ్‌ను బట్టి రూ. 30 చొప్పున కూడా విక్రయిస్తున్నారు. ఎక్కువగా గోదావరి లంకప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని తీసుకువెళుతుంటారు. ఈ ధరకు విక్రయించడం ద్వారా కండెల కొనుగోలుతో పాటు రవాణా ఖర్చులు, బొగ్గులు, ఇతర ఖర్చులు గిట్టుబాటు అవుతాయని వ్యాపారులు చెబుతున్నారు.



విజృంభిస్తున్న జ్వరాలు

వర్షాకాలం.. అల్పపీడనం.. మబ్బులు.. ముసురు.. ఒక్కసారిగా కుండపోత వర్షం.. ఇంకో వైపు వేసవిని తలపించే ఎండలు.. భిన్న వాతావరణంతో ప్రజలు సతమతం అవుతున్నారు. సాధారణంగా జూన్ మూడో వారం నుంచి అక్టోబరు రెండో వారం వరకూ వర్షాకాలం. పర్యావరణ సమతుల్యం దెబ్బ తినడంతో భిన్న పరిస్థితుల్లో విభిన్న సమస్యలు వస్తున్నాయి. ప్రస్తుత వాతారణంలో ఉమ్మడి జిల్లాలో జ్వరాలు విజృంభించాయి. వారం రోజుల నుంచి ఆసుపత్రులకు వచ్చే వారిలో 30 శాతం మంది జ్వర బాధితులే. ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 1200 ఓపీ పేషెంట్లు వస్తుండగా 400 మంది జ్వర బాధితులే వస్తున్నారు.

- ఒక పక్క వర్షాలు.. మరోవైపు ఎండ
- ఉమ్మడి జిల్లాలో జ్వరాల వ్యాప్తి
- వైరల్ ఫీవర్‌తోపాటు డెంగీ, టైఫాయిడ్
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల రద్దీ
- గ్రామాల్లో మందులతో సరి
- ఎక్కడికక్కడ పారిశుధ్యం అధ్వానం
- దోమల వ్యాప్తి.. పెరుగుతున్న రోగాలు



ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

ఏలూరు క్రైం/పాలకొల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, టైఫాయిడ్, సీజనల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నారు. ప్రధానంగా కీళ్లు, మోకాళ్ల నొప్పులు, కూర్చుంటే లేవలేని పరిస్థితి, చలి కుదుపు, జ్వరం, తలనొప్పి, జలుబు తదితర లక్షణాలతో ప్రజలు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. బాధితులు నిత్యం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. రోజుకు రెండు వేల మంది పైగానే జ్వర బాధితులు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఆసుపత్రులకు వెళ్లలేక గ్రామాల్లో ఉన్న ఆర్‌ఎంపీలు, మెడికల్ షాపులకు వెళ్లి మందులు తెచ్చుకుని మింగుతున్నారు.

ఏదో మందులు మింగుతున్నారు

ఈ పూట జ్వరం తగ్గిపోతుందని ఆత్మస్థైర్యం పెంచుకుంటూ గుక్కెడు గంజి, బొక్కెడు జావ లేదా గ్లాసుడు కాఫీ, టీయో తాగి కొంత శక్తిని కూడగట్టుకుంటున్నారు. నిన్నటి వరకూ పొలం పనుల్లో ఎద్దుల్లాగ పనిచేసిన తాము జ్వరంతో శక్తిని కోల్పోయి గ్లాసు మంచి నీళ్లు తాగే ఓపిక కూడా లేని పరిస్థితుల్లో ఉన్నామని కొందరు భయపడుతున్నారు.

వైద్య పరీక్షలు నామమాత్రం

వైద్య ఆరోగ్యశాఖ తరపున ప్రతి గ్రామంలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యు మేల్/ఫిమేల్) పని చేస్తున్నారు. జ్వర బాధితుల నుంచి రక్తం సేకరించి పరీక్షలకు పంపాల్సి ఉండగా నామమాత్రంగానే జరుగుతున్నాయి. ఏలూరు ఆసుపత్రిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. సాధారణ రక్త పరీక్షలు చేస్తున్నారే తప్ప డెంగీ పరీక్షలు చేయడం లేదు. దీంతో రోగిలోని డెంగ్యూ జ్వరం రోజురోజుకు పెరిగిపోతుంది. చివరకు ఇక్కడ పరీక్షలు చేయడం లేదని రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. వాస్తవానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో డెంగీ నిర్ధారణ చేసే ఖరీదైన వైద్య యంత్ర పరికరం ఉంది. మిగిలిన అన్ని ల్యాబ్‌ల్లో కేవలం ర్యాపిడ్ టెస్టుల ద్వారా మాత్రమే డెంగీ నిర్ధారణ చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఆ యంత్ర పరికరం ఉన్నప్పటికి ప్రజలకు అందుబాటులో లేదనే విమర్శలు ఉన్నాయి.

పడకేసిన పారిశుధ్యం

గ్రామీణ ప్రాంతాల్లో మురుగు, డ్రెయిన్లు శుభ్రపర్చకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నాయి. కనీసం మురుగు, వీధులలో కూడా బ్లీచింగ్ వేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఏలూరు నగరంలో కూడా డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నా కనీసం బ్లీచింగ్ వేయడం లేదు. ఆ డ్రెయిన్‌ను పరిశుభ్రం చేయడం లేదు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. దోమల నివారణకు డ్రెయిన్లలో రసాయనాలను పిచికారి చేయాల్సి ఉన్నా అది జరగడం లేదు. ఇంక ఏలూరు నగరంలో అయితే దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా ఎక్కడా చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దీంతో రోజు రోజుకు దోమలు పెరిగి దోమ కాటుకుగురై జ్వరబారిన పడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే జిల్లాలోని ప్రజలు అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

పీహెచ్‌సీల్లో రోగుల రద్దీ

అత్తిలి/లింగపాలెం: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పీహెచ్‌సీల్లో నిత్యం వంద మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. వారిలో సుమారు 40 మంది జ్వరాలతోనే బాధపడుతున్నారు. జ్వరాల బారిన పడుతున్న వారిలో వృద్ధులు, పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు. టైఫాయిడ్, మలేరియా జ్వరాల బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. వర్షాకాలం బ్యాక్టీరియా, వైరస్‌తో వైరల్ ఇన్‌ఫెక్షన్లకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి గ్రామాలలో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. విపరీతంగా చలి, జ్వరం, ఒంటి నొప్పులు, విరేచనాలు, టైఫాయిడ్, మలేరియా లక్షణాలుగా గుర్తించి వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలని సూచిస్తున్నారు.



పరిశుభ్రత పాటించాలి

ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గోరువెచ్చటి నీటిని తీసుకోవాలి. చేపలు, మాంసాహారం తగ్గించుకోవడం మంచిది. ఒళ్లనొప్పులు, తలనొప్పి, జలుబు, కీళ్ల నొప్పులు, చలి లక్షణాలుంటే వైద్యులను సంప్రదించాలి. వైద్యుల సూచనతో మందులను వాడాలి.

- తోకల సికింద్ర మోహన్, అసోసియేట్ ప్రొఫెసర్, వైద్య కళాశాల, ఏలూరు



ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం

ప్రభుత్వాసుపత్రులలో మెరుగైన వైద్య సేవలందుతున్నాయి. గ్రామాల్లో టైఫాయిడ్, మలేరియా జ్వరాలున్నాయి. పంచాయతీ అధికారులతో కలసి గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ రాజశేఖర్, లింగపాలెం పీహెచ్‌సీ



వైరల్ ఫీవర్, టైఫాయిడ్

వైరల్ ఫీవర్, టైఫాయిడ్ బాధితులు ఆసుపత్రికి ఎక్కువగా వస్తున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాచి చల్లార్చిన నీరు తాగడం, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చు. ముఖ్యంగా చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ యజ్ఞ వర్మ, పాలకొల్లు

క్షీరా రామలింగేశ్వరుడిని దర్శించుకున్న

ఏపీపీఎస్సీ సభ్యుడు సుధాకర రెడ్డి




పూజలు చేస్తున్న సుధాకర రెడ్డి దంపతులు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):క్షీరా రామలింగేశ్వరస్వామిని ఏపీపీఎస్సీ సభ్యుడు జీవీసుధాకరరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారికి పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం అభిషేక మండపంలో రెడ్డి దంపతులకు వేదాశీర్వాదం, స్వామి వారి శేష వస్త్రం, చిత్రపటాన్ని అందించారు.

ఏకవార రుద్రాభిషేకాలు

క్షీరా రామలింగేశ్వరస్వామికి సోమవారం ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సప్త సోమవారాల పేరుతో వందలాది మంది భక్తులు ఆలయ ప్రదక్షణ చేశారు. అర్చకులు సన్నిదిరాజు రామకృష్ణ మూర్తి (కిష్టప్ప), పూర్ణయ్య, అనిల్, అభిషేక పండితులు భమిడిపాటి వెంకన్న, మద్దూరి సూరిబాబు, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు. శంకర మఠంలో అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరునికి, శంభన్న అగ్రహారం శంభేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

21న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు



మోటారు బైక్‌లను ఆవిష్కరించిన సీఐ నాగరాజు

భీమవరం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న బీఆర్ అంబేడ్కర్ భవనంలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు అందించే మోటార్ బైక్స్‌ను సీఐ నాగరాజు సోమవారం ఆవిష్కరించారు. భీమవరంలో బాడీ బిల్డింగ్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి విలువైన బహుమతులు అందిస్తున్న నిర్వాహకులను సీఐ అభినందించారు. న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ విజేత, మిస్టర్ ఆంధ్ర ఫిజిక్ మోడలింగ్ విజేతతోపాటు ఆడియన్స్ నుంచి లక్కీ డిప్‌లో గెలిచిన వారికి మూడు బైకులు బహుమతిగా అందిస్తామన్నారు. పోటీల్లో వివిధ జిల్లాల నుంచి బాడీ బిల్డర్లు పాల్గొంటారని తెలిపారు. జిల్లా చైర్మన్ దాసి వరప్రసాద్, అల్లు శ్రీనివాస్, షేక్ ఖాజీ, మోటేపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడుకు మునిసిపాలిటీ హోదా?

- నగర పంచాయతీ స్థాయి పెంపు యోచన
- డిప్యూటీ స్పీకర్ వ్యాఖ్యలతో ఆసక్తి
- సమీప గ్రామాల విలీనంతో అవకాశం
- అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని ఆశ
- ప్రభుత్వం నుంచి చర్యలు లేవు



ఆకివీడు ప్రధాన రహదారి



ఆకివీడు పట్టణంలో వాహనాల రద్దీ

ఆకివీడు సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఆకివీడు నగర పంచాయతీ మునిసిపాల్టీ స్థాయికి పెరుగుతుందని పట్టణ ప్రజలు ఆశిస్తున్నారు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. కుప్పనపూడిలోని తాళ్లకోడు సభలో మునిసిపాల్టీ అంశం తెర పైకి వచ్చింది. ఏ గ్రామాల విలీనంతో మునిసిపల్ స్థాయి వచ్చిందనే చర్చలు జోరందుకున్నాయి. ఆకివీడుకు నాలుగు కిలోమీటర్ల పరిధిలో గ్రామాల విలీనంతో మునిసిపల్‌స్థాయి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీనిపై ఒక నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

అజ్జమూరు, కుప్పనపూడి, దుంపగడప గ్రామాలు ఆకివీడులో విలీనం చేసే అవకాశాలున్నాయి. అధికారులకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. మునిసిపల్ స్థాయికి చేరితే పట్టణ ప్రజలకు వనరులు పెరుగుతాయి. జనాభా ప్రాతిపదికన అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధులు రావడానికి ఆస్కారం ఉంది. అభివృద్ధితోపాటు భూములు, ఆస్తుల విలువతో పాటు డిమాండ్ పెరుగుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. పారిశ్రామిక, వాణిజ్యం, వ్యాపారం పుంజుకుని ప్రజలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అధికారుల సూచనల మేర టౌన్ ప్లానింగ్ నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. శానిటేషన్, రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ శాఖలకు పూర్తిస్థాయిలో ఉద్యోగులు నియమిస్తారు. పంచాయతీరాజ్ శాఖ నుంచి మునిసిపల్ ఉద్యోగులుగా మారడానికి అవకాశం ఉంటుంది. రహదారులు, డ్రెయిన్లు, సిమెంట్ రోడ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు లేబర్ ఏరియాలు అభివృద్ధి చేస్తారు. ఆక్రమణలు తొలగిస్తారు. ఆకివీడు పట్టణం ప్రస్తుతం 20 వార్డులలో సుమారు 50 వేల జనాభా ఉన్నట్లు అంచనా. ఆకివీడులో గ్రామాలు కలిస్తే జనాభా ప్రాతిపదికన వార్డులు పెరుగుతాయి.

మూడు గ్రామాల విలీనం..?

2011 సర్వే ప్రకారం ఆకివీడు జనాభా 34 వేలు, దుంపగడపలో 4,600, అజ్జమూరులో 2 వేలు, కుప్పనపూడిలో 4,000, (కుప్పనపూడి లో తాళ్లకోడు కాలనీ నిర్మాణం ఏర్పడడంతో సుమారు 10 వేలు జనాభా ఉంటారు. ఈ మూడు గ్రామాలు విలీనం చేయవచ్చని ప్రతిపాదన. ఈ గ్రామాల్లో ప్రధానంగా తాగు నీరు, డ్రెయినేజీ, డంపింగ్, పారిశుధ్య సమస్యలున్నాయి. కుప్పనపూడి పంట కాలువలో వ్యర్థాలు కలిపేస్తున్నారు. పరిసర గ్రామాలు మునిసిపాల్టీలో విలీనమైతే ఎన్‌ఆర్‌జీఎస్ పనులు కోల్పోయే అవకాశం ఉంది. ఒనగూరే ప్రయోజనాలు కూడా పరిశీలిస్తున్నారు.

ఎటువంటి ఆదేశాలు రాలేదు



మునిసిపాలిటీ స్థాయి పెంపుపై ఉన్నతాధికారులు ఎటువంటి ప్రతిపాదనలు కోరలేదు.. ఆదేశాలు రాలేదు. ప్రజాప్రతినిధులు ఆలోచన చేసి ఉండవచ్చు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ప్రతిపాదనలు ఉండకపోవచ్చు. ఒకవేళ తమకు ఆదేశాలు వస్తే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతాం. ముందుగా ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌కు తెలియజేస్తాం.

- జి.కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు

వందేభారత్‌కు ఏలూరులో.. రాయగడకు భీమడోలులో స్టాప్ కొనసాగింపు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):విశాఖ నుంచి సికింద్రాబాద్ జంక్షన్‌కు నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్(20708)కు, సికింద్రాబాద్ జంక్షన్ నుంచి విశాఖ వెళ్ళే వందేభారత్ ఎక్స్‌ప్రెస్(20707)కు ఏలూరులో స్టాప్‌ను కల్పించారు. తాత్కాలికంగా కల్పించిన ఈ రైళ్ళ స్టాప్‌లు తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ కొనసాగుతాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 55 రైళ్లకు వివిధ ప్రాంతాల్లో 55 రైల్వేస్టేషన్లలో స్టాప్‌లు ఇచ్చారు. రైల్ నెంబర్ 17243 గుంటూరు నుంచి రాయగడ వెళ్లే రైలుకు భీమడోలు స్టాప్ ఇవ్వగా దానిని కొనసాగిస్తున్నారు.

పలు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

ఏలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి పశ్చిమకు చెందిన పలువురు జనసేన, టీడీపీ నేతలకు చోటు దక్కింది. ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరక్టర్‌గా ఏలూరుకు చెందిన నగర టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకట రత్నం, ఏపీ కమ్మ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లగా ఏలూరుకు చెందిన కట్నేని లక్ష్మీకృష్ణప్రసాద్(బీజేపీ), కావూరి వాణిశ్రీ(జనసేన), నూజివీడుకు చెందిన చిటేని శివరామకృష్ణ(నూజివీడు), ఏపీ స్టేట్ నూర్ భాషా/దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆచంటకు చెందిన షేక్ సయ్యద్ ఆలీ జిన్నా(టీడీపీ) నియమితులయ్యారు.

జీఎస్టీ సంస్కరణలతో అన్నివర్గాలకు ఉపయుక్తం

ఏలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా 33 రకాల మందులు, విద్యార్థుల స్టేషనరీ, డెయిరీ ఉత్పత్తుల ధరలు దిగి వచ్చాయని బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్‌కిశోర్ హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు శ్లాబ్‌లుగా ఉన్న జీఎస్టీని రెండు శ్లాబ్‌లకు తగ్గించడం వలన ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరెళ్ల సుధాకర్ కృష్ణ, కారంకి శ్రీనివాస్, బాడిత నారాయణ, లక్కోజు అనిల్, మత్తి శాస్త్రి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు సౌకర్యాలు కల్పించాలి



ఏలూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):నిరాశ్రయులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వద్దని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆదేశించారు. సోమవారం పత్తేబాదలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించి మాట్లాడారు. పరిసర ప్రాంతాలు వసతి గృహాలను సందర్శించి స్థితిగతులపై ఎప్పటికప్పుడు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థకు రిపోర్టు సమర్పించాల్సి ఉందని, అందులో భాగంగా సోమవారం ఈ వసతి గృహాన్ని సందర్శించామన్నారు. వృద్ధులకు సీనియర్ సిటిజన్ చట్టాలపై అవగాహన కల్పించామని, ప్రభుత్వ పథకాలు పొందడంలో కాని మరి ఏ ఇతర సమస్యలు వచ్చినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించ వలసినదిగా సూచించినట్లు తెలిపారు. వసతి గృహ నిర్వాహకులు, సిబ్బంది, వయో వృద్ధులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన సిబ్బందికి ఉత్తర్వులు అందజేస్తున్న పద్మశ్రీ

జడ్పీ విభాగాల అధికారులతో చైర్‌పర్సన్ పద్మశ్రీ సమీక్ష

ఏలూరు సిటీ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఏలూరు జడ్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ సమీక్షించారు. సమావేశంలో పాత జడ్పీక్వార్టర్లు ఖాళీ చేయించడం, గడువు ముగిసిన షాపులపై ఆక్షన్, అకౌంట్స్ విభాగంలో పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన పనులకు పరిపాలనా ఆమోదం, జడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనాలు చెల్లింపులు, పీఎఫ్ విభాగంలో పెండింగ్ అప్లికేషన్ల క్లియరెన్స్ వంటి అంశాలపై సమీక్షించారు. జడ్పీ పరిధిలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 13 మంది కార్యాలయ సిబ్బందికి రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్/ లైబ్రరీ అసిస్టెంట్లుగా పదోన్నతి ఆదేశాలను చైర్‌పర్సన్ జారీ చేశారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి పదోన్నతి పొందిన సిబ్బందిని అభినందించారు. డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, అధికారులు పాల్గొన్నారు. ఈ నెల పదో తేదీన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు చైర్‌పర్సన్ పద్మశ్రీ అధ్యక్షతన జడ్పీ కార్యాలయంలో జరుగుతాయని సీఈవో ఎం.శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు.

అదనపు పొగాకు విక్రయాలపై అతి తక్కువ పెనాల్టీ



వేలం పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రసాద్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):అదనపు పొగాకుపై అతి తక్కువ పెనాల్టీతో రైతులు అమ్ముకునే అవకాశం కలిగిందని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాలను ఆయన పరిశీలించారు. 2024-25 పంట కాలానికి ఎన్ఎల్ఎస్ పరిధిలో రైతులకు 56 మిలియన్ల పొగాకు పండించాలని బోర్డు కోటా ఇస్తే రైతులు 80 మిలియన్ల వరకు పండించారన్నారు. 2025-26 పంట కాలానికి రైతులు అదనంగా పండించకుండా బోర్డు ఇచ్చిన కోటా మేరకే పండించాలని సూచించారు. ఈ ఏడాది ప్రారంభంలో ధర కొంచెం తక్కువగా ఉన్నా కూడా అది క్రమేపి పెరుగుతూ ప్రస్తుతం రూ.375 వరకు వచ్చిందన్నారు. రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్, వేలం కేంద్రం అధికారులు శ్రీహరి, సురేంద్ర, రైతు నాయకులు పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, కరాటం రెడ్డిబాబు నాయుడు, పొన్నగంటి అనిల్, రైతులు పాల్గొన్నారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా

చింతలపూడి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ చేసిన మోసాలకు నిరసనగా శెట్టివారిగూడెం గ్రామస్థులు సోమవారం ధర్నా చేశారు. ఉదయం నుంచి శిబిరం వేసి నినాదాలు చేశారు. రెండు గ్రామాలు కలిపే రహదారిని 800 ఎకరాలు పంట భూముల్లోకి వెళ్లడానికి గ్రావెల్, మెటల్ రోడ్లు వేస్తామని హామీ ఇచ్చిన కేఎంవీ సంస్థ మాట తప్పడంతో ధర్నా చేస్తున్నట్టు నాయకులు ఆది ధర్మారావు, హరికృష్ణ తెలిపారు. ఈ హామీ తప్పడం వల్ల తాము భూముల్లోకి వెళ్లలేకపోతున్నామని, ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. చింతలపూడి పోలీసులు శిబిరం వద్దకు చేరుకుని చర్చలు జరిపారు. లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామని పేర్కొన్నారు.





ద్వారకాతిరుమలలో చిన వెంకన్నకు నిత్యార్జిత కల్యాణం



భీమవరంలో భక్తులతో కిటకిటలాడిన పంచారామం



ఆలయం సంప్రోక్షణ అనంతరం మావుళ్లమ్మ దర్శనం

ప్రత్యేక అలంకరణలో గునుపూడి సోమేశ్వరస్వామి

భక్తులకు దైవ దర్శనం

తెల్లవారుజామున వీడిన చంద్ర గ్రహణం

సంప్రోక్షణ అనంతరం తెరుచుకున్న ఆలయాలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం వీడడంతో సోమవారం తెల్లవారుజామున చిన్న వెంకన్న ఆలయ ద్వారాలు తెరచుకున్నాయి. ముందుగా ఆలయ నాలుగు రాజగోపుర ద్వారాలను తెరచిన సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను, ప్రధాన రాజగోపుర మెట్లదారిని శుభ్రం చేశారు. అంతకు ముందే ఆలయ అర్చకులు శుద్ధి సంప్రోక్షణాధి కార్యక్రమాలు నిర్వహించారు. తరువాత తిరుమంజనాలను నిర్వహించి ఉదయం నుంచి భక్తులకు స్వామివారు, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్ని ఆర్జిత సేవలను పునరుద్ధరించారు. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో భక్తులు పాల్గొని కల్యాణతంతును భక్తిప్రపత్తులతో తిలకించారు.

కిటకిటలాడిన ఆలయాలు

భీమవరం టౌన్: చంద్రగ్రహణం అనంతరం తెల్లవారుజామున ఆలయ సంప్రోక్షణ చేసి ఆలయాలను శుభ్రం చేశారు. మండపాలను, ఆలయం అంతరాయాలను శుద్ధి చేశారు. స్వామి, అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం అర్చకులు అభిషేకాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు ముందుగా చంద్రగ్రహ దోష నివారణ దానాలను ఇచ్చుకున్నారు. పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం సోమవారం తెల్లవారుజాము 5 గంటల నుంచి 11 గంటలకు భక్తులతో కిటకిటాలాడింది. దోష నివారణ పూజలతో ఆలయంలోని మండలపాలన్ని రద్దీగా మారిపోయాయి. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లాలో మరో పంచారామం పాలకొల్లు క్షీరామలింగేశ్వరస్వామి, ప్రముఖ శివాలయాలైన భీమేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, శక్తీశ్వరరస్వామి, ఆచంట రామలింగేశ్వర స్వామి, నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి, జుత్తిగ ఉమా వాసుకీ రవి సోమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.





కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఎరువుల సరఫరా, పంపిణీపై మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, పాల్గొన్న రైతులు, అధికారులు

యూరియా బ్లాక్ చేస్తే పీడీ యాక్ట్

- ప్రతీ రైతుకు ఎరువులు అందించాలి
- వినియోగంపై అవగాహన కల్పించాలి
- అధికారులతో మంత్రి నాదెండ్ల సమీక్ష

ఏలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరి పండించే ప్రతీ రైతుకు యూరియా, ఎరువులను అందించే బాధ్యత అందరిదీ.. ఈ విషయంలో దుష్ప్రచారాలను జిల్లా యంత్రాంగం ఎక్కడికక్కడ తిప్పికొట్టి, ప్రజల్లో అలజడిని సద్దుమణించే బాధ్యత తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించే డీలర్లు, వ్యాపారులను, బ్లాక్ మార్కెటింగ్ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించి కేసులను నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఎరువుల సరఫరా, పంపిణీ విధానంపై ఎమ్మెల్యేలు, అధికారులతో సోమవారం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సే ధ్యేయంగా వారికి అండగా ఉంటుందన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదు. వాస్తవంగా ఖరీఫ్‌లో 33,762 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 530 కేంద్రాల ద్వారా 32,557 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. రెండు రోజుల్లో 2200 మెట్రిక్ టన్నులు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎరువులను పామాయిల్, ఇతర పంటలకు వాడుతున్నప్పుడు ఆయా రైతులను ఎందుకు సమన్వయం చేయలేకపోయారని వ్యవసాయశాఖ జేడీ హబీబ్ భాషా, ఉద్యానశాఖ జేడీ రామ్మోహన్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నుంచి వారం రోజుల పాటు సంయుక్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఎరువుల వాడకం, లభ్యతపై ప్రధాన కేంద్రాల్లో అవగాహన సదస్సులను నిర్వహించేలా చూడాలని కలెక్టర్ వెట్రిసెల్విని మంత్రి నాదెండ్ల ఆదేశించారు. ఉద్యాన పంటలైన పామాయిల్, పత్తి, మిర్చి, మొక్కజొన్న రైతులకు విరివిగా రాబోయే రోజుల్లో నిల్వలు ఉంచుతామని ఎక్కడ అధైర్యపడవద్దన్నారు.

విజిలెన్స్ దాడులు చేయండి

రాబోయే రోజుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో బ్లాక్ మార్కెటింగ్ చేసేవారిపై దాడులు చేయాలని ఎస్పీ ప్రతాప్ కిశోర్‌కు ఆదేశాలిచ్చామన్నారు. ఇప్పటికే 12 కేసులు బుక్ చేశామని, 29 చెక్‌పోస్టుల వద్ద నిఘా ముమ్మరం చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఎరువుల కొరతపై కలెక్టర్లతో సమీక్షించారని, క్షేత్రస్థాయిలో సమస్యలేకుండా చూడాలని తమను సమావేశాలు పెట్టాలని ఆదేశించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజవర్గంలో ఎరువుల సమస్యలు లేవని, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తి, మిర్చి, పామాయిల్ పంటలకు మాత్రం ఎరువులు అవసరమన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కొరతపై వచ్చిన వార్తలను చూసి రైతులు ఎగబడి ఎరువులు నిల్వ చేసుకుంటున్నారన్నారు. ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాల్లో వరి సాగు ఎక్కువ అని, ఇక్కడ సరఫరా పెంచాలని కోరారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు.

నానో యూరియా మాకొద్దు..

ఎరువుల కొరత లేకపోయినప్పటికి పంపిణీలో సర్వర్ సమస్య, ఈ పోస్ మిషన్లు పనిచేయకపోవడం, లాగిన్ సక్రమంగా లేకపోవడం వలన ఎరువుల స్టాక్ వచ్చిన పంపిణీ చేయలేకపోతున్నామని వివిధ సొసైటీల చైర్మన్లు తాతా సత్యనారాయణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, వరప్రసాద్ తెలిపారు. నానో యూరియాను మాకొద్దన్నా అంటకట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సొసైటీలకు యూరియా, ఇతర ఎరువులు కూడా 12 నుంచి 15 టన్నులు చొప్పున పంపిణీ చేస్తున్నారని, అవి సర్దలేకపోతున్నామన్నారు. 25 టన్నులకు లేదా పెంచితే సర్దుబాటు చేయగలమన్నారు. కొందరు ప్రైవేట్ డీలర్లు 266 బస్తాను రూ.400కు పైబడి అధిక ధరకు విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు.

దీనిపై మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ సర్వర్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి వచ్చిన సరుకు 24 గంట ల్లోగా రైతులకు సరఫరా జరిగేలా డీసీవో, వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నానో ఎరువుల వినియోగంపై తమకు ఫిర్యాదులన్నాయన్నారు. దీనిపై కూడా త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. సమస్యలపై మాట్లాడే అవకాశం రైతులకు కల్పించలేదు. సొసైటీ చైర్మన్ల ప్రభుత్వ, ప్రజా ప్రతినిధుల భజన విమర్శలకు తావిచ్చింది.



గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రాన్ని ఇస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

గల్ఫ్ ఏజెంట్ మృతదేహం స్వగ్రామానికి తీసుకురండి

కుటుంబ సభ్యుల వినతి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ కానూరి గంగాధరరావు(44) గుండెపోటుతో ఈజిప్టులో మృతిచెందాడు. పెనుగొండకు చెందిన గంగాధరరావు గల్ఫ్ ఏజెంట్‌గా పనిచేస్తూ తణుకులో స్థిరపడ్డారు. కొంతమందిని ఈజిప్టుకు ఉపాధి నిమిత్తం పంపించడంతో పాటు గత నెల 13న అతడు కూడా వెళ్లాడు. అక్కడ ఉపాధికి తీసుకెళ్లిన వారిని సెటిల్ చేయడానికి థర్డ్ పార్టీకి చెందిన ఓంకార్‌ను కలిసి లావాదేవీలు పూర్తి చేసుకున్నాడు. ఈనెల 10వ తేదీకి ఇండియా రావడానికి ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుంటానని భార్య రోజాదుర్గతో మాట్లాడారు. కాగా ఈనెల 3న అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. థర్డ్‌పార్టీగా ఉన్న ఒంకార్ గంగాధర్ బంధువులతో ఫోన్లో మాట్లాడి ఇండియాకు మృతదేహాన్ని పంపిస్తానని, ఖర్చులు కూడా తానే భరిస్తానని చెప్పాడు. తర్వాత మాట మార్చి మృతదేహం తీసుకురావడానికి రూ.2లక్షలు ఖర్చవుతోందని తెలియజేశారు. ఈజిప్టులో ఉన్న వ్యక్తి ఖాతాలో జమ చేయాలని చెప్పడంతో గంగాధరరావు బంధువులు తాడేపల్లిగూడెంలో క్రైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావును 8న కలిసి ఆర్థిక పరిస్థితులను వివరించారు. డబ్బులు అవసరం లేకుండా ఇండియాకు తీసుకొచ్చేలా తాను కృషిచేస్తానని గట్టిం మాణిక్యాలరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు గంగాధరరావు వివరాలతో కూడిన వినతిపత్రాన్ని బంధువులు కె.శివప్రసాద్, కె.శ్రీనివాస్, సునంద కలిసి మాణిక్యాలరావుకు అందజేశారు.

సత్రం గదుల కేటాయింపులో అక్రమాలు

ద్వారకాతిరుమల ఉద్యోగి సస్పెన్షన్

మరో కాంట్రాక్ట్ ఉద్యోగి తొలగింపు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండపై 120 గదుల సత్రంలో ఉద్యోగులు అక్రమాలకు పాల్పడుతున్నారు. రసీదులు ఇవ్వకుండా రూములను కేటాయించి డబ్బు దండుకున్న దేవస్థానం ఉద్యోగిని సస్పెండ్ చేయగా మరో కాంట్రాక్ట్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ద్వారకాతిరుమల దేవస్థానం ఉద్యోగి చిలుకూరి పవన్‌కుమార్ సోమవారం టూరిస్టు బస్సులో వచ్చిన కొందరు భక్తులకు కొండపై 120 గదుల సత్రంలో 7 రూములను అనధికారికంగా కేటాయించారు. వారి నుంచి కొంత సొమ్ము వసూలు చేసి సీఆర్‌వో కార్యాలయంలో రసీదులు తీయించలేదు. ఈ విషయం ఈవో మూర్తి దృష్టికి రావడంతో ఆయన ఏఈవోలు మెట్టపల్లి దుర్గారావు, రమణరాజు, విద్యుత్ విభాగ డీఈ టి.సూర్యనారాయణతో విచారణ చేయించారు. వాస్తవమని తేలడంతో పవన్ కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఇందుకు సహకరించిన సీఆర్‌వో కార్యాలయ తాత్కాలిక ఉద్యోగి తలారి వంశిని విధుల నుంచి తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

పెదపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం మర్రిబందంకు చెందిన కాకాని నాగేశ్వరరావును వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ నెల 6న ద్విచక్ర వాహనంపై హనుమాన్ జంక్షన్‌కు వెళుతుండగా సీతారాంపురం దాటిన తరువాత వెనుక నుంచి వ్యాన్ అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన నాగేశ్వరరావును ఏలూరు ఆస్పత్రికి తరలించారు. నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే చింతమనేనిపై వివాదాస్పద వ్యాఖ్యలు

సోషల్ మీడియాలో వీడియో

కేసు నమోదు చేసిన పోలీసులు

పెదపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వడ్డిగూడెం గ్రామానికి చెందిన మోరు రామరాజు గతనెల 24, 29వ తేదీల్లో సోషల్ మీడియాలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తెలుగుదేశం పార్టీపై అసభ్యకరమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. వీడియోల ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలతో కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశారని అదే గ్రామానికి చెందిన ముంగర వెంకట రామకృష్ణరాజు పెదపాడు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రజాశాంతి భద్రతకు భంగం కలిగించే విధంగా చేస్తున్న మోరు రామరాజుపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుగొలను చెరువులో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను చెరువులో గుర్తుతెలియని మృతదేహం సోమవారం బయట పడింది. స్థానిక వీఆర్‌వో ఫిర్యాదుతో రూరల్ ఎస్సై ప్రసాద్ అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడు బ్లూ కలర్‌పై ఎరుపు గడుల చొక్కా ధరించాడని, మృతుని వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పంట పొలాల్లో మృతదేహం

ఇరగవరం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినపర్రు గ్రామ పంట పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని పోలీసులు సోమవారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ జానా సతీష్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడు కాషాయం రంగు షర్ట్ ధరించి ఉన్నాడని, 30 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండవచ్చు అని తెలిపారు. ఎవరైనా హత్య చేసి పొలాల్లో పడేసి ఉంటారని అనుమానంతో దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించామని, మృతుని వివరాలు తెలిసిన వారు ఇరగవరం పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని కోరారు.

ఇద్దరికి అర్హత..మరో ఐదుగురి అనర్హత

డీఎస్సీ దివ్యాంగ అభ్యర్థులకు జీజీహెచ్‌లో అసెస్‌మెంట్ టెస్ట్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామకాల్లో మూడో విడత సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన ఏడుగురు దివ్యాంగ అభ్యర్థులకు వైకల్య శాతాన్ని నిర్ధారణ పరీక్షలు చేశారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన స్క్రీనింగ్, అసెస్‌మెంట్ పరీక్షల్లో ఇద్దరికి మాత్రమే నిర్ణీత అర్హతలున్నట్టు మెడికల్ బోర్డు నిర్ధారించింది. మిగతా ఐదుగురికి అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహించినా డీఎస్సీ మార్గదర్శకాల మేరకు వైకల్యశాతం లేదని మెడికల్ బోర్డు గుర్తించింది. అర్హత సాధించిన వారిలో దృష్టిలోపంవున్న అభ్యర్థి ఒకరు, వినికిడి లోపం వున్న అభ్యర్థి ఒకరు ఉన్నారు. కాగా అనర్హులైన ఐదుగురు దివ్యాంగ అభ్యర్థుల స్థానే సంబంధిత రోస్టర్‌లో తదుపరి మెరిట్‌లో ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉంది. దీనిపై అధికారిక ప్రకటన లేదు.

టాంపరింగ్ చేసిందెవరు?

డీఎస్సీ దివ్యాంగుల కోటాలో సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన ఇద్దరు అభ్యర్థుల వైకల్య శాతాన్ని నిర్ధారించి జారీ చేసిన ధ్రువపత్రాలను టాంపరింగ్ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సూచనల మేరకు జిల్లాకు చెందిన సంబంధిత దివ్యాంగ అభ్యర్థులు సోమవారం గుంటూరు జీజీహెచ్‌కు హాజరయ్యారు. ఆసుపత్రి మెడికల్ బోర్డు జారీ చేసిన స్క్రీనింగ్, అసెస్‌మెంట్ సర్టిఫికెట్‌లపై వైకల్యశాతాన్ని నిర్ధారిస్తూ నమోదు చేసిన అంకెలను దిద్దిన ఉదంతంపై అభ్యర్థుల నుంచి వివరాలు సేకరించారు. వారి వైకల్య శాతంపై మరో దఫా అసెస్‌మెంట్ టెస్టులు నిర్వహించిన అనంతరం సెల్ఫ్ డిక్లరేషన్లను తీసుకున్నట్టు సమాచారం. కాగా అసెస్‌మెంట్ సర్టిఫికెట్ల టాంపరింగ్ వైద్యులస్థాయిలో జరిగిందా.. లేక మరెవరైనా ఉన్నారా.. అనేదానిపై కమిటీ నిర్ధారించినదీ లేనిదీ తెలియరాలేదు. విచారణ అనంతరం నివేదికను సీల్డ్ కవర్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అందజేస్తారని సమాచారం. వినికిడి లోపం (హెచ్ఐ) కోటాలో అభ్యర్థుల ఎంపికకు నిర్ణీత వైకల్యశాతం ఇద్దరికి లేనట్టుగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డు నిర్వహించిన రీఅసెస్‌మెంట్ టెస్టులో నిర్ధారణ కావడంతో తొలుత సంబంధిత అభ్యర్థులకు గుంటూరు జీజీహెచ్ జారీ చేసిన సర్టిఫికెట్లను తిరస్కరించిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో సంబంధిత అభ్యర్థులను సెలక్షన్ జోన్ నుంచి తొలగించినా, సర్టిఫికెట్లను టాంపరింగ్ చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీని వెనుక పాత్రధారులెవరనే దానిపై ఓ పక్క జీజీహెచ్ విచారణకు ఆదేశించగా, మరోపక్క వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖవర్గాల్లో ఆసక్తి నెలకొంది.





చిన్న వంతెనపై నిలిచిపోయిన ట్రాఫిక్, గాలింపు చర్యలతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

పాపం.. ఆ అవ్వకు ఏమైందో..?

- స్థానికులు వారిస్తున్నా కాలువలో దూకేసింది
- యనమదుర్రులో వృద్ధురాలి గల్లంతు
- రాత్రి వరకు లభ్యం కాని ఆచూకీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యనమదుర్రుపై చిన్న వంతెన పైనుంచి సోమవారం ఒక వృద్ధురాలు డ్రెయిన్‌లోకి దూకి గల్లంతైంది. స్థానికుల కథనం ప్రకారం 1వ పట్టణం వైపు నుండి నడుచుకుంటూ వస్తున్న వృద్ధురాలు వంతెనపై చెప్పులు విడిచి డ్రెయిన్‌లో దూకింది. ఆ సమయంలో అక్కడ ఉన్నవారు కేకలు వేస్తున్నా ఆగకుండా ఆమె డ్రెయిన్‌లోకి దూకేసింది. కొంతసేపు డ్రెయిన్‌లో తేలియాడుతూ ఉండడంతో అటు వైపు వెళుతున్న స్థానికులు చూస్తూ ఉండిపోయారు. కొంతసేపటికి ఆమె గల్లంతయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఆ వృద్ధురాలి ఆచూకీ దొరకలేదు. దీనిపై పోలీసులు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఇటీవల పెద్ద వంతెనకు ఇరువైపులా మునిసిపల్ శాఖ మెస్‌లు ఏర్పాటుచేసింది. దాంతోపాటు చిన్న వంతెనకు కొంత మేరే మెస్‌లు ఏర్పాటు చేశారు. పూర్తిగా మెస్‌లు ఏర్పాటు చేసి ఉంటే ఆ వృద్ధురాలు దూకడానికి ఆస్కారం ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. మెస్ లేకపోవడంతో వృద్ధురాలు డ్రెయిన్‌లో దూకేసిందని అంటున్నారు.

● స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చింతలపూడి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం స్మార్ట్ రేషన్‌కార్డును తీసుకొచ్చిందని, దీనివలన గతంలో తీసుకున్న సరుకుల వివరాలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే తెలుస్తుందని, సకాలంలో రేషన్ అందజేసేందుకు కృషి చేస్తున్నట్టు టీడీపీ నాయకులు ఎస్.కె.సుబాని తెలిపారు.



కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గురువులే సమాజానికి దిక్సూచి

పెదవేగి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమాజానికి దిక్సూచీ గురువు అని, అలాంటి గురువును గౌరవించడం మనందరి బాధ్యత అని పెదవేగి తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ అన్నారు. గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను పెదవేగి తహసీల్దారు భ్రమరాంబ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో -1 బి.త్రిపురసుందరి, ఉపాధ్యాయులు పరసా నాగార్జున, రమణ, నెరుసు శ్రీనివాసరావు, మేకా లక్ష్మీనారాయణ, గుప్తా, గుంటూరు శ్రీనివాసరావు, షఫీ పాల్గొన్నారు.

దోమకాటు, అంటు వ్యాధులపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నీటి కాలుష్యం, దోమకాటు ద్వారా ప్రజలకు సోకే అంటువ్యాధులపై సోమవారం స్థానిక గజవల్లివారిచెర్వు అర్బన్ పీహెచ్‌సీలో స్థానికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు మాట్లాడుతూ దోమకాటువల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యావంటి జ్వరాలు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. నివాసాలు, పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా నీటి నిల్వలున్న చోట పరిశుభ్రపరుచుకోవాలని సూచించారు. భోజనానికిముందు చేతులు సబ్బునీటితో శుభ్రపరుచుకోవాలన్నారు. వైద్యాధికారి బాలకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. సోమవారం మహిళలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఏవో బేబి సరోజినికి వినతిపత్రం అందజేశారు. రెడ్డిగణపవరానికి చెందిన శివుడు సావిత్రి, కొలుకులూరి వెంకటరత్నం, దంపనబోయిన అన్నపూర్ణ మరికొందరు మహిళలు వితంతు పింఛన్ల కోసం ఏళ్లతరబడి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సచివాలయం ఉద్యోగుల నిర్లక్ష్యంపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇదే విషయమై ఏవో మాట్లాడుతూ పింఛన్లు రాకపోవడంపై విచారణ చేస్తామని, పేర్లు ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వాట్సాప్‌లో వచ్చే ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయకండి: ఎస్.ఐ.

పోలవరం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గ్రూపుల ద్వారా వచ్చే ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దని సైబర్ నేరగాళ్ల వలలో పడి బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు పోగొట్టుకోవద్దని ఎస్ఐ పవన్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఈ మేరకు ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేయడంతో పాటు పోలవరం మండలంలో సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో హెచ్చరికలు చేశారు. ఆధార్, ఏపీకే, ఎస్‌బీఐ, పీఎం ఏపీకే వంటి పేర్లతో వచ్చే లింకులను ఎట్టిపరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దన్నారు. ఫోన్లు హ్యాక్ చేసి వ్యక్తిగత డేటా చోరీ చేసే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొందరు ప్రముఖుల ఫోన్లు హ్యాక్ అయిన సంగతిని ఎస్.ఐ. గుర్తు చేశారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయం తథ్యం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘన విజయం తథ్యమని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎంపీలు పాటించాల్సిన నిబంధనలపై ఢిల్లీలో టీడీపీ పార్లమెంట్ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు నివాసంలో ఎంపీలకు శిక్షణ జరిగిందన్నారు. ఎంపీ మహేశ్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ ఉభయ సభల్లో ఎన్‌డీఏకు పూర్తి మెజారిటీ ఉందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీలంతా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసి గెలిపిస్తారన్నారు. అలాగే అదనపు పొగాకు కొనుగోళ్ల అనుమతిపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. స్వల్ప పెనాల్టీతో కొనుగోళ్లకు అనుమతినిచ్చిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.జిల్లాలో అత్యధికంగా పొగాకు పండిస్తున్న రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు.

హోమియో ఆసుపత్రికి స్థలం కేటాయించాలని వినతి



టి.నర్సాపురం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురంలో హోమియో ఆసుపత్రి నిర్మాణానికి స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్‌బాషా సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ టి. సాయిబాబా, ఎంపీడీవో నగరాజకుమారికి వినతిపత్రాలు అందజేశారు. టి.నర్సాపురంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓ హోమియో ఆసుపత్రి కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల రోగులు హోమియో చికిత్స ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందుతున్నారన్నారు. సరైన భవనం లేకపోవడంతో వైద్యం అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

మెడికల్ కళాశాలలపై అసత్యప్రచారాలు ఆపండి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలపై అసత్య ప్రచారాలు చేస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేస్తున్నారంటూ వైసీపీ చేసే అసత్యప్రచారాలను ప్రజలు నమ్మకూడదన్నారు. అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ప్రజలందరికీ తెలుసన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాతే పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగాయన్నారు. వైసీపీ హయాంలో 17మెడికల్ కళాశాలలు వచ్చాయని ప్రచారం చేసుకుంటున్న నాయకులు కనీసం ఐదు కూడా నిర్మించలేకపోయారని అన్నారు.

వైకల్యం అధిగమించడానికి ఫిజియోథెరపి దోహదం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వైకల్య పునరావాసానికి ఫిజియోథెరపి దోహదం చేస్తుందని ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి సందీప్ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రపంచ ఫిజియోథెరపి కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ వైకల్యం ఉన్న వారిలో ఫిజియోథెరపి నూతన ఆశలను నింపుతుందన్నారు. ముఖ్యంగా పుట్టుకతో వచ్చే వైకల్యాలను, ప్రమాదవశాత్తు వచ్చిన వైకల్యాలను అధిగమించడంలో ఫిజియోథెరపి వైద్య నిపుణులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. శ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రక్షాళన షురూ!

(5వ పేజీ తరువాయి)

మహేశ్వరపురం వరకు కొల్లేటి కాల్వ పరిధిలో ఆరు మైనర్ డ్రెయిన్‌లకు రూ.23.36 లక్షలు, తాడేపల్లిగూడెం పరిధిలోని తోకలపల్లి మేజర్ డ్రెయిన్‌కు రూ.కోటి 6లక్షలు, గణపవరం మండలంలోని పందికోడు మేజర్ డ్రెయిన్ రూ.8.80 లక్షలు, గణపవరం డ్రెయినేజీ సెక్షన్‌లోని అడవికొలను గ్రామంలో కొత్తకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ. 5.26లక్షలు పూడికలు తీయడానికి ప్రతిపాదిం చారు.

మరోసారి ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

తిరుగుముఖం పట్టారు. అల్లర్ల నేపథ్యంలో కైకలూరు-ఏలూరు రోడ్డులోని మూడు మద్యం దుకాణాలను సాయంత్రం వరకు పోలీసులు మూసివేశారు.

రాజకీయంగా లబ్ధి కోసం వైసీపీ ఎత్తుగడ : విఠలరావు

కులాల మధ్య చిచ్చు పెట్టి వైసీపీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఆరోపించారు. కైకలూరులో సోమవారం కూటమి నేతలు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినాయకుడి నిమజ్జనంలో తలెత్తిన అల్లర్లను మరింత రెచ్చగొట్టి కులాల మధ్య వివాదాలను పెంచి రాజకీయంగా లబ్ధి పొందాలనే యోచనలో మాజీ ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు వున్నారని ఆరోపించారు. దళితులపై దాడులను కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఖండించడమే గాక దోషులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, సర్పంచ్ కేవీఎన్ నాయుడు, మాజీ ఎంపీపీ వలవల రామారావు, జనసేన నాయకులు నల్లగోపుల చలపతి, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, కైకలూరు పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ జాని, మండవల్లి మండల పార్టీ అధ్యక్షుడు సమయం ఏసు బాబు, ఎస్సీ సెల్ నాయకుడు ఓగిరాల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధితుల ప్రాణాలకు రక్షణ కల్పించండి : పౌరహక్కుల సంఘం



బాధితుడిని పరామర్శిస్తున్న పౌరహక్కుల సంఘం బృందం

దానగూడెం ఘటనలో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సీ బాధితులను పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరి శ్రీమన్నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రత్నం, న్యాయవాద బృందం పరామర్శించింది. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎస్సీ యువకుల హత్య కుట్రలో భాగంగా అజయ్‌పై దాడి చేశారన్నారు. బాధిత ఎస్సీ సామాజికవర్గానికి ప్రాణ రక్షణ కల్పించాలని శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. కుట్ర హత్య ప్రయత్నం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల ప్రకారం దోషులపైన కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత యువకులు అజయ్, దినేష్ దానగూడెంలో అగ్రకులస్తులు తమపై జరిపిన దాడిని బృందానికి వివరించారు. పోలీసుల సమక్షంలోనే ఎస్సీ యువకులపైన, కాలనీపైన కొందరు అగ్ర కులస్తులు మూకుమ్మడి దాడి చేశారని బాధిత యువకుల బంధువులు వివరించారు.

ఎరువులందించండి

తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు - బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారంటూ ఆరోపణ

ఏలూరు రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ పంటకు రైతులకు అవసరమైన యూరియా, తదితర ఎరువులను సక్రమంగా అందించాలని కోరుతూ సోమవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు వ్యవసాయ కార్మికులు నిరసన తెలిపారు. ఏఐకేఎస్ బీకేఎంయూ ఏలూరు మండల సమితుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం పట్టా ఉన్న రైతులకు మాత్రమే యూరియా విక్రయిస్తోందని కౌలు రైతులకు ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు రూరల్ మండల కార్యదర్శి పొట్లేలు పెంటయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా తదితర ఎరువులు బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, జిల్లా నాయకులు పి.కిశోర్, బుగ్గల ప్రభాకరరావు, మద్దుల వెంకటస్వామి, బోడిగడ్ల ఏసుబాబు, అరిగెల రాజు, గంట వెంకట్రావు, దాసరి రాము, బి.ఏసురత్నం, మద్దుల రాజేశ్ పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌లో విక్రయాలు : సీపీఐ

సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బ్లాక్ మార్కెట్లో ఎరువులు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రాన్ని అందించారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి..

వేలేరుపాడు: ఖరీఫ్ పంట సాగుచేస్తున్న రైతులు ఎరువుల కొరత కారణంగా ఇబ్బందిపడుతున్నారని తక్షణమే అవసరమైన మేరకు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మున్నీర్ మాట్లాడుతూ రైతులకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులను అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి బాడిస రాము, యర్రా మధు, కే.వెంకటేశ్వరరావు, దుర్గారావు, ఎస్‌కే.గౌస్ ఉన్నారు.

● చింతలపూడి: యూరియా కొరత నివారించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా జరిపారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి, ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర పంటలకు యూరియా అవసరమని అన్నారు.ఎరువుల విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. ధర్నాలో జిల్లా రైతు అధ్యక్షుడు పి.సోమశేఖర్, టి.బాబు, కంచర్ల గురవయ్య, టి.వి.ఎస్.రాజు, ఎస్.కె.కాలేషా, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: సన్న చిన్నకారు రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని సీపీఐ జిల్లా నాయకులు కొప్పుల నాగరాజు అన్నారు. రైతు సమస్యలపై సీపీఐ రాష్ట్ర సమితి ఆదేశాల మేరకు జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. కల్తీ ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. సబ్సిడీపై విత్తనాలు పంట రుణాలు ఇవ్వడం లేదని, వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండటంలేదన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో తిరుపతమ్మ, రామతులసికి వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి కారం ధారయ్య, ఒర్సు శ్రీను, మిరియాల నారాయణ, కామయ్య, వెంకటేశ్వరులు, ముత్తమ్మ, వేముల శ్రీను, పెదకొండయ్య ఉన్నారు.



ఏలూరులో ఆందోళన చేస్తున్న నాయకులు

● కుక్కునూరు: రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. మండలంలోని రైతులకు సరిపడ యూరియా పంపిణీ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎం.వెంకటాచారి, వరకా శ్యామలా, కొన్నే లక్ష్మయ్య, కె.బాబూరావు, భూరేం వెంకట్ పాల్గొన్నారు.

యూరియాపై అసత్య ప్రచారాలొద్దు : టీడీపీ



ద్వారకాతిరుమలలో మాట్లాడుతున్న నాయకులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో రైతులకు యూరియా అందించడంలేదని అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు.సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న ప్రభుత్వ ఎరువుల డిపోను ఆయన పరిశీలించారు. యూరియా నిల్వలపై డిపో సిబ్బందిని ఆరా తీశారు. మండల వ్యవసాయాధికారి సి.పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు సరిపడా 119 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మరో 50 టన్నుల యూరియా కోసం ఇండెంట్ పెట్టినట్లు తెలియజేశారు. యూరియాను రైతులు సక్రమంగా ఉపయోగించుకోవాలని డీఎస్పీ సూచించారు. డీఎస్పీ వెంట సీఐ ఎం.వి.సుభాశ్, ఎస్.ఐ. ఎస్.కె.జబీర్ పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది : టీడీపీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత లేకున్నా వైసీపీ రైతును మోసం చేస్తూ ప్రభుత్వంపై బురద జల్లుతోందని మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నేత ఏపూరి దాలయ్య ధ్వజమెత్తారు. ద్వారకాతిరుమల విశాల సహకార సంఘ ఆవరణలో పలు సొసైటీల అధ్యక్షులు, నాయకులతో కలిసి మాట్లాడారు. మండలంలోని 6 సొసైటీల పరిధిలో 82 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని చెప్పారు. ఎరువుల కొరత ఉందంటూ వైసీపీ దుష్ట ప్రచారం చేస్తోందని అన్నారు. ఘంటా శ్రీనివాసరావు, రూపేష్ కుమార్, పాకనాటి శేషుబాబు, కొయ్యలమూడి చంటియ్య, ఏపూరి కిషోర్, కోట అంజిబాబు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత ఉందని వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఖండించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, సీనియర్ నాయకులు పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్ మాట్లాడుతూ రైతులపై వైసీపీ నాయకులు కపట ప్రేమ చూపిస్తోందన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు,అబ్బిన దత్తాత్రేయ పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు

కామవరపుకోట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాలతో రీజనల్ విజిలెన్స్ అధికారి పి.మహేష్ సోమవారం కామవరపుకోట మండలం తడికలపూడిలోని నాలుగు ఎరువుల షాపుల రికార్డులను, స్టాక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సాయి ధనలక్ష్మీ ట్రేడర్స్ వెంకటరమణ ట్రేడర్స్‌లలో ఓ ఫారం లేనందున 11లక్షల 7 వేల 675 రూపాయల విలువైన 41.700 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏవో జి.వీరయ్య, విజిలెన్స్ ఎస్ఐ సి.హెచ్.రంజిత్ కుమార్, కె.నాగరాజు, కె.సీతారాం, వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు ఉన్నారు.

కుక్కునూరు మండలానికి కేటాయింపు

కుక్కునూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలానికి 77టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా కేటాయించినట్టు వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు. కుక్కునూరులోని గ్రోమోర్ సెంటర్ నుంచి 52టన్నుల యూరియా, శ్రీధరవేలేరు నుంచి 12టన్నుల యూరియాను, వ్యవసాయాధికారి కార్యాలయం నుంచి 13 టన్నుల యూరియా సరఫరా చేయనున్నట్టు తెలిపారు. వచ్చే వారంలో 75టన్నుల యూరియా అవసరమని జిల్లా ఉన్నతాధికారులు తెలియజేశామన్నారు.

తెరుచుకున్న ఆలయ ద్వారాలు



ప్రత్యేక పూజలందుకున్న స్వామి వార్లు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నగరంలో మూతపడిన దేవాలయాలన్నీ సోమవారం వేకువజామున తెరిచారు. రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, వేంకట పవనకృష్ణమాచార్యులు స్వామి వారికి సంప్రోక్షణ జరిపి అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయాల వద్ద అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. సోమవారం కావడంతో శివ పూజలు అధికంగా చేశారు.

● దెండులూరు: చంద్రగ్రహణం అనంతరం మండలంలోని పలు ప్రముఖ దేవాలయాలు తెరుసుకున్నాయి. చల్లచింతలపూడిలోని చిన్న కాశీగా పేరు పొందిన శ్రీమేధా దక్షిణామూర్తి స్వామి ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు వేదపండితులు ఆలయ తలుపులు తెరచి సంప్రోక్షణ చేసి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దెందులూరు, గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటలమ్మ తల్లితో పాటు పలు గ్రామాల్లో ఆలయాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకాలు

కామవరపుకోట:చంద్రగ్రహణం నేపథ్యంలో సోమవారం ఉప్పలపాడులోని అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇలపర్తి శివరామయ్య ప్రసాద్ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపారు. శివనామస్తోత్రాలను పఠించి భజనలు నిర్వహించారు. కామవరపుకోటలోని భద్రకాళీ సహిత వీరభద్రస్వామి, తడికలపూడిలోని గంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి, ఆడమిల్లిలోని కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి, మందా సమేత శనీశ్వరస్వామి, జీలకర్రగూడెంలోని ధర్మలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద భక్తులు గ్రహణం అనంతరం విశేష పూజలతో స్వామిని ఆరాధించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

● భీమడోలు: సంపూర్ణ చంద్రగ్రహణం అనంతరం భీమడోలు మండలంలోని ప్రముఖ దేవాలయాలు సోమవారం తెల్లవారుజాము నుంచి తెరచుకున్నాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి, అంబర్‌పేట గ్రామాల్లో పలు దేవాలయాలు, శివాలయాల్లో సంప్రోక్షణ పూజల అనంతరం భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. భీమడోలోని శ్రీ పార్వతి సమేత భీమేశ్వరస్వామి, పోలసానపల్లిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించగా భక్తులు స్వామివార్లను దర్శించుకుని బ్రాహ్మణులకు దానాలు సమర్పించారు.



చింతమనేనికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందని దెండులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పినకడిమిలో సోమవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ, ఎంపీడీవో పి.శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు కొనరాజు వరప్రసాద్, తాతా సత్యనారాయణ, పార్టీ పెదవేగి మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్, పామర్తి గంగరాజు, జాస్తి ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత..

పెదపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):ఆపదలో అపన్న హస్తం అందిస్తూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలం ఏపూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే చింతమనేని పంపిణీ చేశారు. ఏపూరు గ్రామానికి చెందిన నల్లమోతు సునీతకు రూ.3 లక్షలు, గుడిపూడి జయలక్ష్మి రూ.42,118 చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి అందజేసి, వారి యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లలను విధిగా బడికి పంపాలి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు విధిగా తమపిల్లలను బడిలో చేర్పాలని తద్వారా అక్షరాస్యతను పెంపొందించాలని ఎంపీడీవో పీవీపీ ప్రకాశ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించారు. వెలుగు, అంగన్వాడీ, ఉపాధిహామీ ఉద్యోగులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వారందరితో సమావేశం అనంతరం గ్రామంలో చదువు ప్రాముఖ్యతను చెబుతూ ర్యాలీ నిర్వహించారు. జడ్పీటీసీ సి.హెచ్.శామ్యూల్, ఎంఈవో పరసా వెంకట్రావు, ఏపీవో నాగరాజు వెలుగు సీఏలు, ఉపాధి, అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

పెదపాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి డి.జాన్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. జాన్‌బాబు మాట్లాడుతూ అక్షరాస్యతను పెంపొందించుటకు ప్రభుత్వం విద్యార్థిని, విద్యార్థులకు మరియు వ్యక్తులు, సంఘాలకు వయోజన విద్య ద్వారా వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే చర్యలు తీసుకుందన్నారు. కుటుంబంలోని తల్లి అక్షరాస్యులైతే కుటుంబం మొత్తం అక్షరాస్యతను సాధిస్తుందన్నారు.కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ కేటాయింపులో న్యాయం చేయండి



నిరసన తెలియజేస్తున్న శెట్టిబలిజ నాయకులు

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): తమకు కేటాయించిన ఒక్క బారును సిండికేట్ సభ్యులు అక్రమ మార్గంలో కైవసం చేసుకున్నారంటూ శెట్టిబలిజ సంఘం నేతలు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు.తొలుత తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కోడి దుర్గారావు మాట్లాడుతూ ఏలూరులో తమకు కేటాయించిన బారును బైరెడ్డి విజయ్‌కుమార్ అనే వ్యక్తికి అధికారులు అక్రమంగా లైసెన్స్ ఇచ్చారని, శెట్టిబలిజ కుల జాబితాలో బైరెడ్డి అనే ఇంటి పేరుతో ఎవరూ లేరని, మద్యం సిండికేట్లో బడాబాబులకు బినామీగా ఉన్న విజయ్‌కుమార్ టెండర్ వేశారని ఆరోపించారు. అతడ్ని అడిగితే తమ బాస్ వేయమంటే వేశానని, తనకు ఏమి తెలియదని చెప్పాడన్నారు. అతడు ప్రభుత్వానికి సమర్పించిన కుల ధృవీకరణ పత్రం సరైంది కాదన్నారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తాము రూ.20 లక్షలు నష్టపోయామన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తక్షణం దీనిపై విచారణ చేయాలంటూ ఆర్డీఓను ఆదేశించారని కోడి దుర్గారావు తెలిపారు. కడలి శ్రీనివాస్, యాండ్ర నాగరాజు, జి.రాము, చింతపల్లి రామకృష్ణ, చింతపల్లి గోవింద్, వి.మధుసూదనరావు ధర్నాలో పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

లింగపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్ట్ సమన్వయాధికారి పంకజ్ కుమార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సోమవారం నిర్వ హించారు. లింగపాలెంలోని విద్యావనరుల కేంద్రంలో పాఠ శాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలు, కె.రామారావు, జె.రవీంద్రలు పాల్గొన్నారు. తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కె.వాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



ఉపాధ్యాయులను సన్మానించిన పంకజ్ కుమార్

12న రెడ్‌రన్ మారథాన్

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ నివారణపై అవగాహనకు ఈ నెల 12న ఉదయం 6గంటలకు రెడ్‌రన్ మారథాన్ పేరిట 5కిలోమీటర్ల పరుగును నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం తెలిపారు. సోమవారం ఏలూరులో నిర్వహించిన సమావేశంలో ఈ పరుగు నిర్వహణపై వైద్యాధికారులతో సమీక్షించారు. మారథాన్‌లో కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఆర్ఆర్‌సీ వలంటీర్లు పాల్గొంటారని వివరించారు. రన్‌ను కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, డాప్కూ మేనేజర్ ఆదిలింగం, డీవైఈవో, ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వండి

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ఇమాం, మౌజన్లకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ ఎదుట వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ యూనిస్ పాషా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో 11 నెలల గౌరవ వేతనం అందక ఇమాములు మౌజనులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

లింగపాలెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత 25 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని టీసీహెచ్ఆర్ పాలెం-ధర్మాజీగూడెం ప్రధాన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రోషన్ కుమార్ శంకుస్థాపన చేయనున్నట్టు టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు తెలిపారు. రూ.3.75 కోట్ల నిధుతో సుమారు ఆరు కిలోమీటర్ల మేర రహదారి పనులను మంగళవారం ప్రారంభిస్తారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.



కారుణ్య నియామకం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోలీస్ విభాగంలో విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమరుల కుటుంబాలను ప్రోత్సహించడం, ఆదుకోవడం తమ ప్రధాన బాధ్యత అని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ శాఖలో ఎస్ఐ పెద్దిరాజు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుమారుడు పి.నవీన్ కుమార్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామక పత్రాన్ని ఎస్పీ అందించారు.

సీతారాం ఏచూరికి నివాళి

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఎం కార్యాలయంలో సోమవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు జోహార్లు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, బి.బలరాం, ఎ.రవి, ఆర్.లింగరాజు, తెల్లం రామకృష్ణ, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, ఎస్.మహంకాళిరావు, తామ ముత్యాలమ్మ, పి.మంగరాజు, పి.సూర్యారావు, గుడిపాటి నరసింహారావు, పంపన రవికుమార్, శ్యామలరాణి, అరుణకుమారి, కనకారావు, గోపి, ఇస్సాకు, ఆదిశేషు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయ అనివేటి మండప ప్రాంతంలో సోమవారం బాలలు, మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన, చూపరులను ఆకట్టుకుంది. ఎం.ఎం.పురానికి చెందిన శ్రీసాయి శ్రీనివాస కోలాట భజన బృందం బాలలు, మహిళలు ముందుగా సాంప్రదాయ దుస్తులు ధరించి క్షేత్రానికి వచ్చి కోలాటాలు జరుపుతూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆ తరువాత వివిధ దేవతా మూర్తులను కీర్తిస్తూ వారు నిర్వహించిన కోలాట ప్రదర్శనతో ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికత శోభిల్లింది.

ఘనంగా అన్నదానం

పెదపాడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో ప్రసిద్ధి చెందిన విఘ్నేశ్వరస్వామి దేవాలయం వద్ద సోమవారం మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయ కచవితి నుంచి భక్తులచే పూజలందుకున్న గణపతి నిమజ్జనం అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మరియ తల్లి జయంతి

పెదవేగి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూచింపూడిలో ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మరియ తల్లి జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం మేత్రాసనం గురువు ఫాదర్ జయరాజు ముఖ్య అతిథిగా పాల్గొని, జయంతి వేడు కల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. న్యాయంపల్లి విచారణ గురువులు ఫాదర్ బాలస్వామి, ఫాదర్ తంబి, సిస్టర్ మేరీగ్రేస్, సంఘ పెద్దలు ఎం.రాజు, కె.చిన్న బుద్ధియ్య, జి.దాసు, రమేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణతో గడ్డి మందు పిచికారీ

చాట్రాయి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్ ఆవరణలో గడ్డి దట్టంగా పెరిగి పాములు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. దీంతో 1978-83 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సొంత నిధులతో సోమవారం ఆవరణలో పిచ్చిమొక్కలు తొలిగించి, ట్రాక్టర్ ట్యాంకర్‌తో గడ్డి మందు స్ప్రేయింగ్ చేయించారు. ఎంఈవో-2 వివిఎస్‌వి బ్రహ్మాచారి, స్థానిక నాయకులు కందుల కృష్ణ, మోరంపూడి రమేష్, బొట్టు దుర్గారావు, అప్పారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మైక్రో వాటర్ ఫిల్టర్‌ను వినియోగంలోకి తెండి: ఎంపీడీవో

కలిదిండి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం గుర్వాయిపాలెంలో నిరుపయోగంగా ఉన్న మైక్రో వాటర్ ఫిల్టర్ సిస్టమ్‌ను పరిశీలించి వినియోగంలోకి తేవాలన్నారు. ఈ నెలాకరులోగా తాగునీటి చెరువును తాజా నీటితో నింపి క్లోరినేషన్ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు, సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, కార్యదర్శి ఉదయ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



కైకలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కైకలూరు లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ వై శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. సోమవారం కైకలూరు నేషనల్ హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ మేగ్నెట్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ మగువ ఆధ్వర్యంలో 1700 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. అనంతరం రూ.30 వేలు విలువైన 6 కుట్టుమిషన్లను 6 గురు మహిళలకు లయన్స్‌క్లబ్ ఆఫ్ మగువ ఆధ్వర్యంలో అందజేశారు. కైకలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మీ మానస, ఏలూరు శంకర నేత్రాలయ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



ఆగిరిపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నవరం క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్, మదర్ థెరిస్సా ప్రేయర్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో తోటపల్లి ఎంఎం చర్చిలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్టు నిర్వాహకులు క్రౌన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ రమేష్ పాల్, ఎంఎం చర్చి పాస్టర్ కాటూరి జాన్ సునీల్ తెలిపారు. శిబిరాన్ని నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. పలు వ్యాధులకు సంబంధించి 250 మందికి వైద్యులు కిరణ్, సౌమ్య, రోహన్, ఆదినారాయణ, శివకుమార్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రూ.5 లక్షలు మందులను పంపిణీ చేశారు. క్రౌన్ డైరెక్టర్ కాదేష్, తోటపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పరిమి శోభనాద్రి తదితరులు పాల్గొన్నారు.



తుప్పల తొలగింపు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

శ్మశానవాటికకు భూమి కేటాయింపు

మంత్రి సహకారంతో తుప్పల తొలగింపు

ముసునూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వలసపల్లిలో 40 ఏళ్ళ శ్మశానవాటిక సమస్య ఎట్టకేలకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో సోమవారం పరిష్కారమైంది. గ్రామంలో ఏళ్ళ తరబడి హిందు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భూమిని కేటాయించాలని ఇటీవల సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మేదరమెట్ల సురేంద్రతోపాటు మరికొంత మంది స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై ఆయన ముసునూరు తహసీల్దార్ ప్రశాంతితో ఫోన్‌లో మాట్లాడి గ్రామంలో ఖాళీగా ఉన్న రెవెన్యూ పోరంబోకు భూమిని 50 సెంట్లు కేటాయించాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ భూ కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ భూమిలో ఉన్న తుప్పల తొలగింపు పనులను మండల టీడీపీ అధ్యక్షులు గద్దె రఘుబాబు, సర్పంచ్ తదితరులు ప్రారంభించారు. రఘుబాబు మాట్లాడుతూ శ్మశానవాటికకు భూమిని కేటాయించడంలో సహకరించి, అందులో ఉన్న జంగిల్‌ను తొలగించేందుకు సొంత నగదు సుమారు రూ. 30 వేలను మంత్రి ఇచ్చారని ఆయన తెలిపారు. మంత్రి సారథికి టీడీపీ నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు మోటారు వితరణ



చాట్రాయి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం సోమవారం దాత చెరుకు శ్రీనివాసరావు రూ. 26 వేలు విలువైన మోటారు, పంపు, ప్యానల్‌బోర్డు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు, ఎంఈవోలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని టేబుల్ గ్లాస్‌ల వితరణ



ఆగిరిపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వట్టిగుడిపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఇందిర, మాగంటి నాగభూషణం దంపతులు మండల విద్యాశాఖ కార్యాలయానికి ఆఫీస్ టేబుళ్ళకు రూ. పదివేల విలువ చేసే రెండు గాజు పలకలను అందజేశారని ఎంఈవోలు హేబేలు, కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఎస్టీయూ ఉమ్మడి కృష్ణాజిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, మండల అధ్యక్షుడు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. 3.38 లక్షల విరాళం



ముదినేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో సంప్రోక్షణ అనంతరం స్వామివార్లకు అర్చకులు తోలేటి వీరభద్రశర్మ, రుద్రపాక బాల గంగాధరతిలక్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కైకలూరు మండలం అటపాక గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పటాకుల లక్ష్మణ్ యాదవ్ ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ. 3,38,641లు విరాళంగా పంపగా లక్ష్మణ్ తండ్రి వెంకటేశ్వరరావు ఆలయ సిబ్బందికి అందజేశారు.

తెరుచుకున్న ఆలయాలు

కలిదిండి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం ఆలయాలు తెరుచుకున్నాయి. కలిదిండిలో పాతాళ భోగేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి, కోరుకొల్లులో సోమేశ్వర స్వామి, పెదలంక నాగేశ్వర స్వామి ఆలయాల్లో సంప్రోక్షణ అనంతరం భక్తులకు స్వామివార్ల దర్శనం కల్పించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



గోదాములేవీ?

- కొత్తగా నిర్మించరు.. ఉన్న దానిని వినియోగించరు
- ముసునూరు మండలంలో గోదాముల్లేక రైతుల పాట్లు





ముసునూరులో నిర్మాణానికి కేటాయించిన స్థలం (ఇన్‌సెట్) గోపవరంలో నిరుపయోగంగా గోదాము

ముసునూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను ప్రకృతి వైపరీత్యాలతో భద్రపరుచుకుని ఆశించిన ధరలు వచ్చినప్పుడు అమ్ము కోవడానికి మండల వ్యాప్తంగా ఒక్క గోదాము కూడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గోదాముల నిర్మాణాలకు నిధులు విడుదల చేసి నిర్మాణాలను పూర్తిచేయడంలో విఫలమైంది. ఒక్క గోపవరంలో మాత్రమే పూర్తయినా అది నేటికీ వినియోగంలోకి రాలేదు. మిగిలిన ఆరు గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 50 సెంట్లు చొప్పున భూమి కేటాయించినా నిర్మాణాలకు అంకురార్పణ జరగలేదు. దీంతో ఈ భూముల్లో పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వం వదిలివేసిన గోదాముల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి తమకు అందుబాటులోకి తేవాలని మండల రైతులు కోరుతున్నారు.

నిర్మాణాలకు చర్యలు తీసుకుంటాం...

గోదాముల నిర్మాణాలకు సంబంధించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సత్వరమే నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని నూజివీడు డీఎల్‌సీవో రవికుమార్ అన్నారు. గోపవరంలో గోదామును త్వరలో వినియోగంలోకి తెస్తామని వివరించారు.



తుక్కులూరు పీఏసీఎస్‌లో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల కొరత లేదు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం తుక్కులూరు పీఏసీఎస్‌ను సోమవారం నూజివీడు మండల తహసీల్దార్ భద్రునాయక్, మండల వ్యవసాయశాఖ అధికారి పలగాని చెన్నారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా పంపిణీని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో 51 టన్నుల యూరియా, సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉందన్నారు. ఇంకా 25 టన్నుల యూరియాను ఏపీ మార్క్‌ఫెడ్‌కు ఇండెంట్ ఇవ్వడం జరిగిందని, రైతులకు కొరత లేకుండా ఎరువులను సరఫరా చేస్తామన్నారు.



ముసునూరు సొసైటీలో రైతులకు యూరియాను అందజేస్తున్న ఏవో, సొసైటీ అధ్యక్షుడు

అందుబాటులో యూరియా

ముసునూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత లేదని, కో-ఆపరేటివ్ సొసైటీలు, గ్రోమోర్‌లో 42 మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని మండల వ్యవసాయ అధికారిణి ఎ. చాముండేశ్వరి అన్నారు. సోమవారం ముసునూరు సొసైటీలో ఎరువుల విక్రయాలను ఆమె పరిశీలించి, సొసైటీ అధ్యక్షులు దేవినేని శ్రీధర్‌తో కలిసి ఆమె రైతులకు యూరియాను పంపిణీ చేశారు. యూరియా అధికంగా వాడటం వల్ల పంటలకు చీడపీడలు ఆశిస్తాయని, వరికి ఒక విడతకు 30 కేజీలు చొప్పున మూడు సార్లు యూరియాను వేసుకోవాలని, అధిక దిగుబడి కోసం నానో యూరియాను పిచికారీ చేసుకోవాలని ఏవో రైతులకు సూచించారు. ఆయిల్‌పామ్, పండ్ల తోటలకు డ్రిప్ పద్ధతిలో నానో యూరియాను వాడుకోవాలని సూచించారు. వరిలో నాణ్యత, గింజ బరువు పెరిగేందుకు, చీడపీడలు రాకుండా ఉండేందుకు అమ్మోనియం సల్ఫేట్‌ను వాడుకోవాలన్నారు. సెక్రటరీ దాసిరెడ్డి లక్ష్మణరావు, వీఏఏ దుర్గాబాయి, రైతులు పాల్గొన్నారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు

స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మూల్లంక-పెదలంక ప్రధాన రహదారి మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు అన్నారు. సోమవారం రైతులు స్వచ్ఛందంగా మరమ్మతులు చేస్తున్న రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు మూల్లంక నుంచి పెదలంక వరకు 7 కిలోమీటర్ల మేర సుమారు రూ. 3.5 లక్షలతో స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేయటం అభినందనీయమన్నారు.

ఏపీటీఎఫ్ నిరసన

ముదినేపల్లి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ముదినేపల్లి మండలశాఖ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ముదినేపల్లి జడ్పీ హైస్కూలు వద్ద సమాఖ్య జిల్లా కమిటీ కన్వీనర్ టి. నారాయణదాసు ఆధ్వర్యంలో నాయకులు, ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 17 వరకు ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన వారం కార్యక్రమాలను ఉపాధ్యాయులు జయప్రదం చేయాలని కోరారు.

యూరియా కొరత నివారించాలని సీపీఐ ధర్నా



నూజివీడు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే ఎరువులను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం విఫలమవడంతో యూరియా కొరతతో రైతులు ఇక్కట్లు పడుతున్నారని సీపీఐ నాయకులు ఆరోపిస్తూ సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ వినూత్నకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్రసమితి నాయకులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వరి పొట్టదశలో ఉన్న పరిస్థితుల్లో యూరియా లేక పోవడంతో పంట దిగుబడుల పై ప్రభావం పడే పరిస్థితి ఉందన్నారు. పీఏసీఎస్, రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు మడుపల్లి నాగేంద్రరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కూచిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ టెండర్లపై విచారణ జరపాలి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు కోటమహిషాసురమర్దిని ఆలయంలో వివిధ పనుల నిర్వహణకు సంబంధించి పిలిచిన టెండర్లు, పనుల అప్పగింతపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని, నూజివీడుకు చెందిన పలువురు ఎలక్ట్రీషియన్లు, దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనూరాధను కోరారు. దసరా ఉత్సవాల్లో ఆంధ్రా మైసూర్‌గా అభివర్ణించే నూజివీడుకు ఒక ప్రత్యేకత ఉందని, జమీందారీ కాలం నుంచి ఇక్కడ ఉత్సవాలు నిర్వహించటం ఆనవాయితీ అని, ఈ నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించి పిలుస్తున్న టెండర్లు, పనుల అప్పగింతపై సమగ్ర విచారణ నిర్వహించాలని నూజివీడుకు చెందిన ఎలక్ట్రీషియన్లు కోరారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు ప్రభుత్వ పెద్దలు ఆదేశించారని పేర్కొంటూ నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు లేకుండానే ఈవో ఒక వ్యక్తికి పనులు అప్పగించినట్టు తెలుస్తోందని దీనిపై విచారణ నిర్వహించాలన్నారు. హుండీ ఆదాయం లెక్కింపు విషయంలో స్థానిక భక్తులు అందుబాటులో ఉన్నా పక్క జిల్లా నుంచి ధర్మప్రచార పరిషత్ బృందం పేరుతో హుండీ ఆదాయం లెక్కింపునకు మహిళలను తీసుకువచ్చి వారికి దారిఖర్చులు, భోజనం ఏర్పాట్లు పేరుతో ఆలయ ధనాన్ని వృథా చేశారని, ఇలా పలు అంశాలపై జిల్లా అధికారులు విచారణ చేపట్టాలని వారు కోరారు.

శ్మశాన వాటికకు దారి కోసం వినతి

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఐ పోతురెడ్డిపల్లి శాఖ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు మడుపల్లి వెంకట నాగేంద్రరావు మాట్లాడుతూ గ్రామంలో దళితుల శ్మశాన వాటిక ఉన్నా దారిలేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దారి సౌకర్యం ఇచ్చేందుకు పరిసర ప్రాంత రైతులు ముందుకువచ్చినా ప్రభుత్వం రైతులకు న్యాయం చేసేందుకు ముందుకు రాకపోవడంతో ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందని, 2018లో ఆర్డీవో జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని, ప్రభుత్వం స్పందించి శ్మశానానికి దారిసౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు బాబూరావు, నాగభూషణం, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా బ్లాక్ చేస్తే పీడీ యాక్ట్: నాదెండ్ల



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరి పండించే ప్రతీ రైతుకు యూరియా, ఎరువులను అందించే బాధ్యత అందరిదీ.. ఈ విషయంలో దుష్ప్రచారాలను జిల్లా యంత్రాంగం ఎక్కడికక్కడ తిప్పికొట్టి, ప్రజల్లో అలజడిని సద్దుమణిచే బాధ్యత తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించే డీలర్లు, వ్యాపారులను, బ్లాక్ మార్కెటింగ్ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించి కేసులను నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో ఎరువుల సరఫరా, పంపిణీ విధానంపై ఎమ్మెల్యేలు, అధికారులతో సోమవారం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సే ధ్యేయంగా వారికి అండగా ఉంటుందన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదు. వాస్తవంగా ఖరీఫ్‌లో 33,762 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 530 కేంద్రాల ద్వారా 32,557 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామన్నారు. రెండు రోజుల్లో 2200 మెట్రిక్ టన్నులు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఎరువులను పామా యిల్, ఇతర పంటలకు వాడుతున్నప్పుడు ఆయా రైతులను ఎందుకు సమన్వయం చేయలేకపోయారని వ్యవ సాయశాఖ జేడీ హబీబ్ బాషా, ఉద్యానశాఖ జేడీ రామ్మోహన్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవా రం నుంచి వారం రోజుల పాటు సంయుక్తంగా ఏడు నియోజకవర్గాల్లో ఎరువుల వాడకం, లభ్యతపై ప్రధాన కేంద్రాల్లో అవగాహన సదస్సులను నిర్వహించేలా చూడాలని కలెక్టర్ వెట్రిసెల్విని మంత్రి ఆదేశించారు. ఉద్యాన పంటలకు రాబోయే రోజుల్లో నిల్వలు ఉంచుతామని ఎక్కడ అధైర్యపడవద్దన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేసేవారిపై దాడులు చేయాలని ఎస్పీకి ఆదేశాలిచ్చామన్నారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పత్తి, మిర్చి, పామాయిల్ పంటలకు ఎరువులు అవసరమ న్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఉంగుటూరు, దెందు లూరు నియోజకవర్గాల్లో వరి సాగు ఎక్కువ అని, ఇక్క డ సరఫరా పెంచాలని కోరారు.

మరోసారి ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)



బాధితుడికి పౌరహక్కుల సంఘం బృందం పరామర్శ

తిరుగుముఖం పట్టారు. అల్లర్ల నేపథ్యంలో కైకలూ రు-ఏలూరు రోడ్డులోని మూడు మద్యం దుకా ణాల ను సాయంత్రం వరకు పోలీసులు మూసి వేశారు.

లబ్ధి కోసం వైసీపీ ఎత్తుగడ: విఠలరావు

కులాల మధ్య చిచ్చు పెట్టి వైసీపీ నాయకులు రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు ఆరోపించారు. కైకలూరులో సోమవారం కూటమి నేతలు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినాయకుడి నిమజ్జనంలో తలెత్తిన అల్లర్లను మరింత రెచ్చగొట్టి కులాల మధ్య వివాదాలను పెంచి రాజకీయంగా లబ్ధి పొందా లనే యోచనలో మాజీ ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు వున్నారని ఆరోపించారు. దళితులపై దాడులను కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఖండించడమే గాక దోషులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, సర్పంచ్ కేవీఎన్ నాయుడు, మాజీ ఎంపీపీ వలవల రామారావు, జనసేన నాయ కులు నల్లగోపుల చలపతి, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, కైకలూరు పట్టణ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ జాని, మండవల్లి మండల పార్టీ అధ్యక్షుడు సమ యం ఏసు బాబు, ఎస్సీ సెల్ నాయకుడు ఓగిరాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

దానగూడెం ఘటనలో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సీ బాధితులను పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంబూరి శ్రీమన్నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.రత్నం, న్యాయవాద బృందం పరామర్శించింది. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎస్సీ యువకుల హత్య కుట్రలో భాగంగా అజయ్‌పై దాడి చేశారన్నారు. బాధిత ఎస్సీ సామాజికవర్గానికి ప్రాణ రక్షణ కల్పించాలని శ్రీమన్నారాయణ డిమాండ్ చేశారు. కుట్ర హత్య ప్రయత్నం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల ప్రకారం దోషులపైన కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత యువకులు అజయ్, దినేష్ దానగూడెంలో అగ్రకులస్తులు తమపై జరిపిన దాడిని బృందానికి వివరించారు. పోలీసుల సమక్షంలోనే ఎస్సీ యువకులపైన, కాలనీపైన కొందరు అగ్ర కులస్తులు మూకుమ్మడి దాడి చేశారని బాధిత యువకుల బంధువులు వివరించారు.

విధుల్లో అనారోగ్యానికి గురైన హెడ్ కానిస్టేబుల్



చికిత్స పొందుతున్న అశోక్‌కుమార్

కైకలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కైకలూరులో అల్లర్ల నేపథ్యంలో బందోబస్తు నిర్వహించేందుకు వచ్చిన పోలీసు అనారోగ్యానికి గురయ్యాడు. సోమ వారం కైకలూరు కరకట్ట వద్ద విధులు నిర్వహిస్తున్న కాకినాడ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ డి. అశోక్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఆకస్మికంగా స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో స్థానిక పోలీసులు హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

ఘనంగా అక్షరాస్యతా దినోత్సవం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని నూజివీడు ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లంకపల్లి రాజేష్, సిద్ధార్థ కళాశాల సంస్కృత అధ్యాపకులు వకుళాదేవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ సిలబస్‌లో ఉన్న పాఠ్యాంశాలతో పాటు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందించారు. పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ ఎం.రుక్మిణి పాల్గొన్నారు.

ఆలయంలో పూజాద్రవ్యాల విక్రయానికి వేలం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు కోటమహిషాసురమర్దిని ఆలయంలో కొబ్బరికాయలు, పూజాద్రవ్యాల అమ్మకం, చీరల సేకరణకు సోమవారం బహిరంగ వేలం నిర్వ హించారు. ఈ సందర్భంగా మొత్తం ఆదాయం రూ.2,52,500గా వచ్చినట్లు ఈవో అలివేణిశ్రీ తెలిపారు. దేవదాయ ధర్మదాయశాఖ గన్నవరం ఇన్‌స్పెక్టర్ అనూరాధ పర్యవేక్షణలో వేలం నిర్వహించగా కొబ్బరి కాయలు, పూజాద్రవ్యాల విక్రయానికి నన్నాగంగమ్మ లక్షా15,500లకు పాడుకోగా, చీరలు సేకరణ హక్కులను కొచ్చర్లకోట వెంకటసత్యమూర్తి లక్షా 37వేలకు పాడుకున్నట్లు ఆమె తెలిపారు.

పంట కాలువలో గుర్రపుడెక్క నివారణకు స్ప్రే

మండవల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంట కాలువల్లో గుర్రపుడెక్కను నివారణ మందును పిచికారీ చేయిస్తున్నట్టు గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండవల్లి మండలం కొర్లపాడు నుంచి మూడు తాళ్ళపాడుకు వెళ్లే పంటకాలువలో గుర్రపుడెక్క నివారణకు డ్రెయినేజీ అధికారులతో కలిసి మందుల పిచికారీని పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నీటి ప్రవాహానికి అవరోధం కలగకుండా గుర్రపుడెక్క నివారిస్తున్నామన్నారు.



గ్రీన్ విలేజ్‌లో బోల్తా పడిన వాటర్ ట్యాంకర్

వాటర్ ట్యాంకర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

కైకలూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఏలూరు రోడ్డులోని గ్రీన్ విలేజ్‌లో రహదారి అధ్వానంగా ఉండడంతో వాటర్ ట్యాంకర్ అదుపు తప్పి గోతిలో పల్టీ కొట్టింది. సోమవారం కైకలూరులోని గ్రీన్ విలేజ్‌లోకి మంచినీరు తీసుకువెళ్తున్న వాటర్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. పెద్దపెద్ద గోతులు ఉండడంతో ట్యాంకర్ తిరగబడినట్లుగా స్థానికులు పేర్కొన్నారు. ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సాయంతో ట్యాంకర్‌ను యథాస్థానంలోకి తీసుకువచ్చారు.

కోటపాడులో సారా స్వాధీనం

చాట్రాయి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడులో సోమవారం జరిపిన దాడిలో అబ్బదాసరి నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని, ఇతనికి సారా సరఫరా చేస్తున్న పోతనపల్లి చిన్న తండాకు చెందిన ధారావత్తు రాముపై కూడా కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. అలాగే గతంలో నేరస్థలం నుంచి పారిపోయిన పోలవరం గ్రామానికి చెందిన మేముల గ్రేసమ్మను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు.

ప్రక్షాళన షురూ!

(5వ పేజీ తరువాయి)

మహేశ్వరపురం వరకు కొల్లేటి కాల్వ పరిధిలో ఆరు మైనర్ డ్రెయిన్‌లకు రూ.23.36 లక్షలు, తాడేపల్లిగూడెం పరిధిలోని తోకలపల్లి మేజర్ డ్రెయిన్‌కు రూ.కోటి6లక్షలు, గణపవరం మండలంలోని పందికోడు మేజర్ డ్రెయిన్ రూ.8.80 లక్షలు, గణపవరం డ్రెయినేజీ సెక్షన్‌లోని అడవికొలను గ్రామంలో కొత్తకోడు మైనర్ డ్రెయిన్‌కు రూ. 5.26లక్షలు పూడికలు తీయడానికి ప్రతిపాదించారు.